# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం
వార్షికోత్సవం
1996 - 2026


## హనీ ట్రాప్, సైబర్ నేరాలపై అప్రమత్తం : ఎస్పీ తుషార్



చిత్తూరు, మే 2 ప్రభాతవార్త: డిజిటల్ యుగంలో సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్స్ వినియోగం విస్తరించడంతో 'హనీ ట్రాప్' అనే సైబర్ మోసం ఇటీవల కాలంలో ఎక్కువైందని దీనిపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఎస్పీ తుషార్ డూడి పేర్కన్నారు. హనీ ట్రాప్ నేరాల్లో సైబర్ నేరస్తులు నకిలీ సోషల్ మీడియా ప్రొఫైల్స్ సృష్టించి అందమైన యువతులు లేదా యువకులుగా నటిస్తూ అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. మొదట స్నేహపూర్వకంగా పరిచయం పెంచుకుని క్రమంగా వ్యక్తిగత వివరాలు తెలుసుకుంటూ బాధితుల విశ్వాసం సంపాదించి అనంతరం వీడియో కాల్స్, వ్యక్తిగత ఫోటోలు పంచుకోవాలని ప్రలోభపెట్టి వాటిని రికార్డ్ చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడతార న్నారు. ఇలాంటి ఘటనల్లో బాధితులను బెదిరిస్తూ వారి వ్యక్తిగత ఫోటోలు లేదా వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామని చెప్పి డబ్బు వసూలు చేయడం జరుగతుందన్నారు. అత్యధిక బాధితులు భయం, అనుమానభావంతో పోలీసులకు ఫిర్యాదు చేయకుండా నేరస్తులకు డబ్బులు చెల్లిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు హనీ ట్రాప్ మోసాల బారిన పడకుండా ఎస్పీ కొన్ని సూచనలు చేశారు. తెలియని వ్యక్తుల నుండి వచ్చే ఫ్రెండ్స్ రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దు. సోషల్ మీడియాలో కొత్తగా పరిచయం అయిన వారితో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దు. అనుమానాస్పద వ్యక్తులతో వీడియో కాల్స్ చేయడం, ముఖ్యంగా అనుచిత ప్రవర్తనకు ప్రొత్సహించే కాల్స్‌ను పూర్తిగా నివారించాలి. వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, బ్యాంక్ వివరాలు వంటి సున్నితమైన సమాచారంను ఎట్టి పరిస్థితుల్లోను పంచుకోవద్దు. హనీట్రాప్‌కు గురైన పక్షంలో భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, లేదా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెం.1930 ద్వారా ఫిర్యాదు చేయాలి. అలాగే అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలి. బాధితుల గోప్యతను కాపాడుతూ నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

## ముగిసిన శ్రీ పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు



తిరుచానూరు, మే 2 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన వార్షిక వసంతోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు కార్యక్రమాల్లో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను ఊరేగింపుగా శుక్రవారపు తోటకు వేంచేపు చేశారు. మధ్యాహ్నం నుండి స్నపనతిరుమంజనం నిర్వహించారు. రాత్రి అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆ తరువాత మహా పూర్ణా హుతితో అమ్మవారి వసంతోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్లు సురేష్, ముని చెంగల్రాయులు, రమేష్ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చలపతి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 5న గంగమ్మజాతర చాటింపు

**-మూడురోజులు ముందే మొదలైన కోలాహలం-ఏర్పాట్లపై అధికారులు సన్నద్ధం**



తిరుపతి,మే 2ప్రభాతవార్త: తిరుపతి నగర గ్రామదేవతగా పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మజాతర వారంరోజులు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. జాతర ఆరంభానికి శుభసూచకంగా మంగళవారం 5వతేదీ అర్ధరాత్రి చాటింపుతో జాతరకు శ్రీకారం చుడతారు. జాతర వేడుకలు వరుసగా, బైరాగివేషం, బండవేషం, తోటివేషం, దొరవేషం, మాతంగివేషం, సున్నపు కుండలు వేషం, చివరగా 12వతేదీ గంగజాతర వేడుకలు జరుగుతాయి. 13వ తేదీ వేకువజామున పేరంటాలు అమ్మవారి ప్రతిమను చంప నరకడంతోవ ముగుస్తాయి.ఇందుకు ప్రభుత్వశాఖలన్నీ సిద్ధమయ్యాయి. ఆలయంలో ఏర్పాట్లు, క్యూలైన్లు, భక్తుల అనుమతి, వైద్యశిబిరాలు, తాగునీరు, పారిశుధ్యం పై నగరపాలకసంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ శారదాదేవి, గంగమ్మఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఈఓ జయకుమార్, నగరపాలకసంస్థ ఆర్ఓ సేతు మాధవ్, ఆలయ కమిటీ సభ్యులు రుద్రకిశోర్, బాలసుబ్రమణ్యం, చంద్రశేఖర్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ఆలయంలోపల, పరిసర ప్రాంతాల్లోను, మార్కెట్ లో పొంగళ్ళు పెట్టె ప్రాంతాల్లో చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయ పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి శుభ్రంగా ఉంచాలని హెల్త్ ఆఫీసర్ కు సూచించారు. గంగజాతరకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తామని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు.











## నోటిఫికేషన్ హడావిడి...అర్హులకు అందలం దక్కేనా!

**- శ్రీ చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డ్ నియామకానికి సన్నాహాలు**

సూళ్ళూరుపేట, మే 2 ప్రభాతవార్త: తెలుగు తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాల మాత పరమేశ్వరి దేవస్థానానికి నూతనంగా ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న ఇప్పటివరకు చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డు నియామకానికి వర్గ పోరు, కోర్టు అడ్డంకులతో బ్రేక్ పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఆశావహుల ఉత్సాహానికి తగ్గట్టుగా నోటిఫికేషన్ విడుదలై ప్రస్తుతం పట్టణంలో చర్చినియాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిరువూరు సుధాకర్ రెడ్డికి ఛైర్మన్ పదవి దాదాపు ఖరారైనట్లు సమాచారం. ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీలు ఆయనకు ఇచ్చిన హామీ మేరకు పదవిని కట్టబెట్టినందుకు అన్ని చర్యలు చేపట్టారు. కాగా ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకాల్లో మాత్రం కొంత అస్పష్టత నెలకొని ఉంది. అన్ని వర్గాలను సంతృప్తి పరిచే విధంగా ట్రస్ట్ బోర్డు సభ్యుల ఎంపిక చేపట్టాలని పార్టీ అధిష్టాన వర్గం ఆలోచనగా ఉంది. దీంతో చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పదవి కోసం ఇప్పటివరకు పట్టు పట్టిన వేనాటి వర్గానికి రెండు సభ్యులను ఇచ్చే విధంగా రాజీ జరిగిందని ప్రచారం జరుగుతుంది. ఇది ఎంతవరకు నిజమో కానీ తెలియడం లేదు. మరో వైపు కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన బిజెపి, జనసేనలకు చెరో ఒక బోర్డు సభ్యుల పదవి ఇవ్వాలని అధిష్టానం వర్గం సూచనగా ఉంది.

దీంతో సుళ్లూరుపేట నియోజకవర్గ పార్టీ నాయకత్వం ఇందుకు అనుగుణంగా జాబితా సిద్ధం చేసి అధిష్టానంకు పంపినట్లు సమాచారం. ఇదిలా ఉండగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తమను విస్మరించి కనీసం ట్రస్ట్ బోర్డు సభ్యులు పదవి కూడా ఇవ్వకపోవడం దారుణమని పలువురు కార్యకర్తలు వాపోతున్నారు. ఇప్పటికే కొంతమంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే శ్రీ చెంగాలమ్మ దేవస్థానం కార్యాలయం నుంచి బోర్డు సభ్యుని పదవికి దరఖాస్తు ఫారంలను తీసుకువెళ్లారని తెలిసింది. ఇది ఇలా ఉండగా గతంలో ఏర్పాటు చేసిన శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ బాలాం జనేయ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డుల నియామకాల్లో అర్హులైన వారికి పదవులు ఇవ్వలేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం శ్రీ చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డు సభ్యుల విషయంలో పార్టీ కోసం పనిచేసిన వారికి పదవి ఇవ్వడంతో పాటు వారి ఆధ్యాత్మిక తను దృష్టిలో పెట్టుకొని బోర్డు నియామకాలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీలోని సామాన్య కార్యకర్తలు కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తానే వంశ పారంపర్య ధర్మకర్తలంటూ కోర్టుకు వెళ్లిన అర్వ భూమి చంద్రశేఖర్ రెడ్డి ఈ పరిణామాలతో ఎటువంటి చర్యలు చేపడుతారో వేచి చూడాల్సిందే.

## నేడు నీట్ పరీక్ష

**అరగంట ముందే గేట్లు క్లోజ్-విద్యార్థులు తస్మాత్ జాగ్రత్త**



తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త: వైద్య విద్యలోని పలు యూజీ కోర్సులలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కీలకమైన నీటీ యూజీ పరీక్ష ఆదివారం జరగనుంది. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాలలో 4542 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో పకడ్బంది ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లా నోడల్ అధికారులు, సిటీ కోఆర్డినేటర్లు, సీసీ కెమెరాల ఏర్పాటు, తనిఖీ సిబ్బంది, పోలీసు బందోబస్తు తదితర ఏర్పాట్లపై జిల్లా అధికారులు ఇప్పటికే జిల్లాలోని పలు శాఖాధికారులతో సమావేశమై చర్చించారు. పరీక్షా కేంద్రాలలో నిరంతర విద్యుత్, ఫ్యాన్లు, త్రాగునీరు, రవాణా, మెడికల్ శిబిరాలు ఏర్పాటు చేశామని, పరీక్షా కేంద్రాలలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతులు ఉండవని అధికారులు తేల్చి చెప్పారు.

**అరగంట ముందే గేట్లు క్లోజ్:**

నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి. నిరక్ష ్యం వహిస్తే విద్యార్థి భవిష్యత్తు అంధకారమే. మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభం కానున్న పరీక్షకు విద్యార్థులు అడ్మిట్ కార్డుతో ఉదయం 11గంటల నుంచి 1.30 గంటలలోపు పరీక్షా కేంద్రాలోనికి వెళ్లాల్సి ఉంటుంది. 1.30గంటలకు పరీక్షా కేంద్రాల గేట్లు మూసి వేయనున్నారు. ఈ లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోకపోతే విద్యార్థులు పరీక్ష రాసేందుకు అనుమతి ఉండదు. పరీక్షలకు హాజరయ్యే 12 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ పర్యవేక్షణ చేసే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు.

**కేంద్రాలు ఇవే...**

పీఎం కేంద్రీయ విద్యాలయం తిరుపతి ఇస్కాన్ టెంపుల దగ్గర,ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ బాలాజీ కాలనీ,ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాల లక్ష్మీ ్మపురం సర్కిల్,ఎస్ జి ఎస్ హైస్కూల్ భవానీ నగర్,పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల బాలాజీ కాలనీ, పద్మావతి మహిళా యూనివర్సిటీ పద్మావతి నగర్,ఎస్వీ జూనియర్ కళాశాల సంస్కృత వర్సిటీ సమీపంలో ,ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వింగ్ ఏ బాలాజీ కాలనీ,ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వింగ్ బీ బాలాజీ కాలనీ














## కాణిపాకంలో ఘనంగా చిత్రాపౌర్ణమి అభిషేకాలు

కాణిపాకం, మే 2 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయ కస్వామి దేవస్థానంలో శుక్రవారం చిత్రాపౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఏటా ఆలయంలో చిత్రాపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ మేరకు రాత్రి వరదరాజస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం ఆలయ పుష్కరిణి వద్ద ప్రధాన ఆలయంలోని శ్రీ సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామితో పాటు శ్రీదేవి భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ పుష్కరిణి వద్ద ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ మేరకు పలు రకాల సుగంధద్రవ్యాలతో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అభిషేకించి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెంట్లు కోదండపాణి, వాసులు, టెంపెల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీ నాయుడు, అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

## అర్ధగిరి ఆలయానికి దాతలచే పెయింట్ పనులు పూర్తి

తవణంపల్లి, మే 2 ప్రభాతవార్త:



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయానికి దాతలు సుమారు లక్ష రూపాయల వ్యయంతో నూతనంగా పెయింటింగ్ పనులు చేపట్టి పూర్తి చేశారు. దేవస్థానంలో ఈ నెల 12వ తేదీ నుండి జరుగనున్న శ్రీ హనుమాన్ జయంతి వేడుకల ఏర్పాట్లలో భాగంగా హైదరాబాదుకు చెందిన సంజీవి కుటుంబసభ్యులు ప్రధాన ఆలయానికి, రాజగోపురానికి తమ సొంత నిధులతో పెయింట్ పనులు చేపట్టి పూర్తి చేశారు. దాతలకు ఆలయ నిర్వాహకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇదిలా వుండగా చిత్రాపౌర్ణమి సందర్భంగా పూతలపట్టు మండలం బత్తలవారిపల్లికి చెందిన అంబిక అనే భక్తురాలు సుమారు రూ.60 వేలు వెచ్చించి భక్తులకు ఉచితంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంను ఆలయ చైర్మన్ ఎ.రఘుపతి, ఇఓ మునిశేఖర్‌లు ప్రారంభించారు. అన్నదానం నిర్వహించిన దాత అంబిక దంపతులను చైర్మన్, ఇఓలు అభినందించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## అన్నక్యాంటీన్‌లో నాణ్యమైన ఆహారం అందించాలి

– ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, మే2 ప్రభాతవార్త



అన్నక్యాంటీన్‌లలో ప్రజలకు మరింత నాణ్యమైన ఆహారం అందించాలని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం సూచించారు. శనివారం మండలంలోని మల్లానూరులోని అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించి స్వయంగా భోజనం చేశారు. ఈ సందర్భంగా అక్కడ భోజనంకు వచ్చిన ప్రజలు, విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నారని వారు పేర్కొంటూ సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వైకాపా పాలనలో అన్న క్యాంటీన్‌లు లేక ఇబ్బందులు పడేవారమన్నారు. కార్యక్రమంలో కుప్పం శ్రీతిరుపతి గ ంగమ్మ గుడి చైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు, మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి ఐదులక్షల చెక్కు అందజేత

శాంతిపురం, మే 2 ప్రభాతవార్త



మండలంలోని సొన్నేగానిపల్లికి చెందిన తెదేపా కార్యకర్త జయప్ప ఇటీవల మరణించాడు. ఇతనికి పార్టీ తరపున చేపట్టిన భీమా పథకంలో భాగంగా ఐదు లక్షల రూపాయలు భీమా నగదు అందేలా మంత్రి నారా లోకేష్ చర్యలు చేపట్టారు. శనివారం ఈచెక్కును జయప్ప కుటుంబీకులకు ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ అందించారు. బాధిత కుటుంబానికి తెదేపా ఎప్పుడూ అండగా ఉంటుందని వారు భరోసా ఇచా ్చరు. కార్యక్రమంలో నేతలు మునేగౌడు, మంజునాథరెడ్డి, బాలు, నాగరాజు, అనసూయ పాల్గొన్నారు.

## దళితుల సమస్యల పరిష్కారంకు చర్యలు : తహశీల్దార్

కుప్పం, మే 2 ప్రభాతవార్త



ప్రభుత్వం ఆదేశాల మేరకు దళితుల సమస్యల పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దార్ చిట్టిబాబు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధి చీగలపల్లి దళిత వాడలో పౌర హక్కుల దినోత్సవంను శనివారం నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తేవాలని కోరారు. గ్రామా ల్లో ఎక్కడైనా వివక్ష చూపడం, రెండుగ్లాసుల విధానం ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఆర్‌పిఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ దళితుల సమస్యలపై కొందరు అధికారులు నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. సమావేశంలో ఆర్ఐ వేణుగోపాల్, మున్సిపల్ అధికారి రహీమ్, తెలుగు యువత అధ్యక్షుడు ప్రశాంత్, దళిత నేతలు అన్నాదొరై, ప్రసాద్, తిమ్మరాయప్ప, మోహన్ పాల్గొన్నారు.

## చిత్తూరు ఎంపిని కలసిన ఎంఆర్‌పిఎస్ నేతలు

కుప్పం, మే 2 ప్రభాతవార్త



చిత్తూరు ఎంపి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్‌రావును శనివారం కుప్పం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) నేతలు కలసి ఘనంగా సత్కరించారు. తదేపా పొలిట్‌బ్యూరోలో చోటు దక్కడం పట్ల ఎంపిని అభినందించారు. దళితులు, అణగారిన వర్గాల హక్కుల సాధనలో మరింత ముందుండాలని ఎంపిని వారు కోరారు. పలు సమస్యలను ఎంపి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నియోజ కవర్గ కో ఇన్‌చార్జ్ వెంకటేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, గౌరవాధ్యక్షుడు పాపన్న, నేతలు గోవిందప్ప, జయప్ప, పళని పాల్గొన్నారు.

## ఒడిశా గవర్నర్‌ను కలసిన కేఈసీ వైస్ చైర్మన్

కుప్పం, మే 2 ప్రభాతవార్త



ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు ని భువనేశ్వర్‌లోని రాజ్ భవన్‌లో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్ మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ పొందిన గవర్నర్ హరిబాబు ప్రస్తుత ఇంజినీరింగ్ రంగంలో ఉన్న ధోరణులు మరియు భవిష్యత్ అవకాశాలపై విలువైన సూచనలు అందించారు. అలాగే, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల 25 సంవత్సరాల ప్రయాణం, అభివృద్ధి, సాధనల గురించి డా. సునీల్ రాజ్ గారు సమగ్రంగా వివరించారు. సిల్వర్ జూబిలీ సందర్భంగా కళాశాల బృందం చేసిన కృషిని గవర్నర్ ప్రశంసించారు.

## పల్లెనిద్ర కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన

పూతలపట్టు, మే 2, ప్రభాతవార్త



పూతలపట్టు మండలంలో వేణుతనపల్లి పంచాయతీ కూటమారపల్లి గ్రామంలో శనివారం రాత్రి 10 గంటలకు పల్లెనిద్ర కార్యక్రమం సీఐ గోపి నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ గోపి మాట్లాడుతూ ధైర్యస్పర్శ, మహిళలు, చిన్నపిల్లలు పట్ల జరిగే నేరాలు, సైబర్ క్రైమ్స్, మాదకద్రవ్యాల వినియోగం, దాని వలన కలిగే నష్టాలు, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాలు, సీసీ కెమెరాలు యొక్క ఉపయోగం, పోలీసులు ప్రజల మధ్య స్నేహపూర్వకమైన సంబంధాల పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, సుమారు 70 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యారంగంను రక్షించుకుందాం

– రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ

చిత్తూరు, మే 2 ప్రభాతవార్త:



ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) వ్యవస్థాపనలో కీలక పాత్ర పోషించి రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షులుగా, రెండు సార్లు ఎమ్మెల్సీగా పని చేసిన దాచూరి రామిరెడ్డి ఆదర్శాలతో ఉద్యమించి ప్రభుత్వ విద్యారంగంను రక్షించుకోవాలని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ పిలుపునిచ్చారు. దాచూరి రామిరెడ్డి 10వ వర్ధంతి పురస్కరించుకుని శనివారం జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జివి రమణ మాట్లాడుతూ దాచూరి రామిరెడ్డి సాధారణ రైతు కుటుంబంలో పుట్టి చిన్నతనం నుండే అభ్యుదయ భావాలతో ఉద్యమాల బాట పట్టారన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిల్లో పోరాటాలు చేసి నేటితరం యుటిఎఫ్ నాయకులకు పోరాట స్ఫూర్తి కల్పించారన్నారు. ప్రతి యుటిఎఫ్ నాయకుడు దాచూరి రామిరెడ్డిని ఆదర్శంగా తీసుకుని పోరాటాలు సాధించి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రెడ్డప్పనాయుడు, ఎన్.మణిగండన్‌లు, యుటిఎఫ్ నాయకులు రెహెనాబేగం, పంటపల్లి సురేష్, ఎస్‌పి భాషా, సాధనకుమార్, సుధాకర్, వాసుదేవపిళ్ళై, ఎస్.భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఆరోగ్య రక్షణ

గుడిపాల, మే 2 ప్రభాతవార్త:



వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా ఉపాధి కూలీల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి పేర్కొన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, ఎంపిడిఓ శిరీష, ఎపిఓ పుష్పలతలు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ మాట్లాడుతూ కూలీల భద్రత దృష్ట్యా ఉపాధి పనులను ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా వుండటంతో మధ్యాహ్న సమయాల్లో కూలీలు విశ్రాంతి తీసుకోవాలన్నారు. అలాగే కూలీలకు వడదెబ్బ తగలకుండా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తగు చర్యలు తీసుకుని కూలీలకు అవగాహన కల్పించాలన్నారు.

## పక్షుల దాహార్తి తీర్చడానికి అపోలో విద్యార్థులు చొరవ

– కొబ్బరి చిప్పలతో పక్షులకు ఆహారం, నీరు ఏర్పాటు



చిత్తూరుహెల్త్, మే 2 ప్రభాతవార్త:

వేసవిలో ఎండలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో దాహంతో అలమటించే పక్షులకు నీరు, ఆహారంను అందిస్తూ అపోలో విద్యార్థులు మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రకృతి పట్ల తమ ప్రేమను అపోలో యూనివర్సిటీ విద్యార్థులు తమ చేతల్లో చూపిస్తూ వినూత్న కార్యక్రమం నిర్వహించారు. కొబ్బరిచిప్పలను ఆహార పాత్రలుగా మలచి చెట్లకు వ్రేలాడదీసి పక్షులకు ధాన్యం, నీరు అందించే ఏర్పాట్లు చేశారు. అపోలో నాలెడ్జ్ సిటీ క్యాంపస్ పరిపాలన భవనం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రిజిస్ట్రార్, ప్రొపెసర్ డాక్టర్ ఎం.పోతురాజు, అదనపు రిజిస్ట్రార్ అనిల్‌కుమార్ ఎస్. యూనిట్ హెడ్ ఎస్.బాలరాజ్‌లు హాజరై కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పక్షులకు ఆహారం, నీరు అందించడం వంటి చిన్న ప్రయత్నాలే జీవ వైవిధ్యంను కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొబ్బరి చిప్పలను శుభ్రం చేసి వాటిని సురక్షితంగా దారంతో చెట్లకు కట్టి ఆహార పాత్రలుగా మలిచారు. వాటిలో ధాన్యం, నీరు నింపి పక్షులకు సులభంగా అందుబాటులో వుండేవిధంగా ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రంగా వున్న నేపథ్యంలో పక్షులకు తాగునీరు, ఆహారం దొరకడం కష్టసాధ్యమవుతుందని, ఇలాంటి సమయాల్లో ఈ చిన్న ప్రయత్నం వాటి జీవనానికి ఎంతో ఉపకరిస్తుందని క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈకో క్లబ్ ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఫిరోజ్‌బేగం, ఐసిసి ఛైర్‌పర్సన్ డాక్టర్ హిమబిందు, అసోసియేట్ డీన్ డాక్టర్ బి.నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందేలా చర్యలు

– ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల, ఎంపి దగ్గుమళ్ల



కుప్పం, మే 2 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ ్గుమళ్ల ప్రసాద్‌రావు పేర్కొన్నారు. శని వారం ఏరియా ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్ అధ్యక్షతన ఆస్పత్రి సలహాకమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ కుప్పం ప్రజల ఆరోగ్యం కోసం సిఎం చంద్రబాబు సంజీవని ప్రాజెక్టు (డిఐఎన్‌సి)ని కుప్పం ఏరియా ఆస్పత్రితో పాటు అన్ని పిహెచ్‌సిల్లో అమలు చేస్తున్నారన్నారు. ఈ ప్రాజెక్టు మరింత విజయవంతం అయ్యేలా వైద్యబృందం ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్యులు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపి దగ ్గుమళ్ల ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధ ం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, ఎంఎస్ డాక్టర్ విజయకుమారి, ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ ప్రశా ంత్ గౌడ, మంజునాథ్, కాశీనాథ్, రేఖ, వైద్యులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ప్రజలకు చట్టాలపై అవగాహన అవసరం



బైరెడ్డిపల్లి, మే 2 ప్రభాతవార్త

మండలంలోని బేలుపల్లిలో శనివారం పలమనేరు జూనియర్ సివిల్ జడ్జ్ ఎం.లిఖిత ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అనధికారిక చీటీలు ఎక్కువగా కొనసాగుతూ, ప్రజలు మోసపోతూ, న్యాయ స్థానాలను ఆశ్రయిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. చీటీలు రిజిస్ట్రేషన్ లేకుండా నడపడం చట్ట విరుద్ధమని అలాంటి వారి వద్ద గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చీటీలు కడుతూ, లక్షలాది రూపాయలు కోల్పోతున్నారన్నారు. ఖాళీ ప్రామిసిరీ బాండ్, బ్లాంక్ చెక్స్ నులో పొరపాటున కూడా, సంతకాలు చేసి, ఇవోద్దని, భవిష్యత్తులో మోసపోతారని ఆమె హెచ్చరించారు. అదేవిధంగా బాల్య వివాహాలపై అవగహన, తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు సమస్యలు వచ్చినప్పుడు స్థానిక గ్రామ పెద్దలకు పిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని, అలా కానీ పక్షంలో నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పిర్యాదు చేయాలన్నారు, ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈషాద్ అలీఖాన్, వైస్ ప్రెసిడెంట్ ఆర్ లోకేష్, ఎస్ఐ చందన ప్రియ, పోలీస్ సిబ్బంది, నాగరాజు నాయుడు, పళని వేలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గ్రామాల్లోనూ మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలు

– ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

చిత్తూరురూరల్, మే 2 ప్రభాతవార్త :



గ్రామాల్లోనూ మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. శనివారం చిత్తూరు రూరల్‌మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గ్రామపంచాయతీలకు స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా చెత్తసేకరణ పుష్ కాట్లు, ట్రై సైకిళ్ల పంపిణీ చేసారు. గ్రామాల్లోని తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి ప్రాసెస్ చేయడం ద్వారా వ్యర్థాలు పోగుకాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ పుష్‌కాట్లు, ట్రైసైకిళ్ల ద్వారా గ్రామాల్లోను మెరుడైన పారిశుధ్యపనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం వేరుశనగ విత్తనాలను సిద్ధం చేసినట్లు, మండలానికి అవసరమైన వేరుశనగ విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని, నిజమైన రైతులకు విత్తలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో శ్రీనివాసులు, తహశీల్దారు కళ్యాణి, మండల పార్టీ అధ్యక్షుడు రఘు, మోహన్‌రాజ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ అను, టౌన్‌బ్యాంకు చైర్మెన్ కాంద్ర రమేష్‌నాయుడు, కూటమినాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థి లాహిద్‌కు సత్కారం

చిత్తూరురూరల్, మే 2 ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు దీటుగా మా ర్కులు సాధించడం ఎంతో గర్వకా రణంగా వుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్ర భు త్వ పాఠశాలలను ప్రోత్సహించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు అరుణశివప్రసాద్ కోరారు. చిత్తూరు వరదప్పనాయుడు నగరపాలక ఉన్నత పాఠశాలలో చదువుతున్న లాహిద్ పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 590మార్కులు సాధించడంతో శనివారం గంగనపల్లెలోని విద్యార్థి ఇంటికి వెళ్లి సత్కరించి రూ.1000ల నగదును అందజేసారు. 2024 సంవత్సరంలోనే జనవిజ్ఞానవేదిక లాహిద్ ప్రతిభను గుర్తించి గణిత అవదానం చేయించినట్లు గుర్తుచేసారు. అలాగే 590మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. లాహిద్‌ను సత్కరించినవారిలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్‌ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు గణిత అవధాన గురువు హెచ్ ఆరుణశివప్రసాద్, నగరశాఖ అధ్యక్షులు సుధాకర్, విజయకుమార్, పిల్లారప్ప, అమర్నాధరెడ్డి, బాలయ్య గణిత ఫోరం రాష్ట్ర కార్యదర్శి చంద్రమనాయుడు, జిల్లా అధ్యక్షురాలు పాపుదేసి జయంతి, ప్రధాన కార్యదర్శి నరేంద్ర, వరదప్పనాయుడు పాఠవాల ఉపాధ్యాయులు రాజశేఖర్ తదితరులు వున్నారు.

## జర్నలిస్ట్ జగన్ కుటుంబాన్ని ఆదుకుంటాం

కలెక్టర్ సుమిత్ కుమార్

వి.కోట, మే 2 ప్రభాతవార్త:



ఇటీవల హత్యకు గురైన జర్నలిస్ట్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. హత్యకు గురికాబడిన జగన్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి సీఎం చంద్రబాబుకు సిఫారసు లేఖను పంపారు. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ శనివారం బాధిత కుటుంబీకులను కలిసి పరామర్శిం చారు. జగన్ మోహన్ రెడ్డి భార్య గీతాంజలికి ధైర్యం చెప్పి ,పిల్లల్లో మనోధైర్యాన్ని నింపారు. పిల్లల చదువులు ఖర్చులు భరిస్తానని చెప్పారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ దిశగా కార్యాచరణకు అధికారులను ఆదేశించారు. సీఎంఆర్ఎఫ్ సహాయానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ఘటనకు పాల్పడిన నిందితుల పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు రామచంద్ర నాయుడు, రాంబాబు, రంగనాథ్ తదితరులున్నారు.

## జర్నలిస్ట్ జగన్ కుటుంబాన్ని పరామర్శించిన ప్రముఖులు

వి.కోట, మే 2 ప్రభాతవార్త

శనివారం సాయం త్రం చిత్తూరు పార్ల మెంటు సభ్యులు దగ్గు మల్ల ప్రసాద్ రావు, ప్రభుత్వ విప్, డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ ఉపా ధ్యక్షులు మునిరత్నం పాత్రికేయుడు జగన్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి న్యాయం చేకూ ర్చుతామని భరోసా కల్పించారు. తదనంతరం పూతలపట్టు శాసనసభ్యులు మురళి, జగన్ కుటుంబాన్ని పరామర్శించి తన సానుభూతిని తెలుపుతూ 50 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

## నిర్ణీత గడువులోపు జనగణన ప్రక్రియ పూర్తి

– జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు

చిత్తూరు, మే 2 ప్రభాతవార్త:

నిర్ణీత గడువులోపు జనగణన ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిడినెల్లూరు మండలం ముక్కలుత్తూరు పంచాయతీలో జరుగుతున్న జనగణన విధులను శనివారం జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, ఎంపిడిఓ మనోహర్‌గౌడ్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిపిఓ శ్రీనివాసరావు ముక్కలత్తూరులో ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న డేటా నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. దేశాభివృద్ధికి ప్రాతిపదిక అయిన జనగణనలో ప్రతి ఒక్కరి వివరాలు కచ్చితంగా వుండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఎన్యూమరేటర్లకు ఎదురవుతున్న సాంకేతిక సందేహాలను సిపిఓ నివృత్తి చేస్తూ నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఎన్యూమరేటర్ కీర్తన, ఇతర సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న బంగారు చైను భక్తురాలికి అప్పగింత

కాణిపాకం, మే 2 ప్రభాతవార్త:



ఆలయ దర్శనార్థం వచ్చి పోగొట్టుకున్న బంగారు తాళి పూసల చైనును సిబ్బంది భక్తురాలికి అప్పగించిన సంఘటన కాణిపాకం ఆలయంలో శనివారం జరిగింది. అనంతపురంకు చెందిన లక్ష్మీదేవమ్మ అనే భక్తురాలు శనివారం కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చారు. ఆమె ఆలయంలోని రూ.150 క్యూలైన్‌లో కొబ్బరికాయలు కొట్టు స్థలం వద్ద సుమారు 10 గ్రాముల బంగారు తాళి గొలుసు చైను పోగొట్టుకొంది. అక్కడే డ్యూటీలో వున్న హోమ్‌గార్డు గుణశేఖర్ ఈ విషయంను గమనించి ఈ చైనును దేవస్థానం ఎఇఓ ప్రసాద్‌కు అందజేశారు. ఈ మేరకు చైను పోగొట్టుకున్న బాధితులు దేవస్థానం కార్యాలయంను సంప్రదించడంతో తగిన ఆధారాలతో బాధితురాలికి చైను అప్పగించారు. ఈ కార్యక్రమంలో హోమ్‌గార్డు ఇన్‌ఛార్జీ వినాయకం తదితరులు పాల్గొన్నారు.

## రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**వడమాలపేట, మే 2 ప్రభాతవార్త:**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం వడమాలపేట తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జరీనా, ఎంపీడీవో శేషగిరిరావు ఓ ప్రకటనలో వారు తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయంకు వెళ్లాల్సి న పని లేదని ఇక్కడే పరిష్కరించుకోవచ్చునని వారు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలు సీజ్



**విజయపురం, మే 2 ప్రభాతవార్త:**
ఆంధ్రప్రదేశ్‌నుంచి విజయపురం మండలం మీదుగా తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక లారీలను మండల పరిధిలో గాండ్లకండ్రిగ చెక్‌పోస్టు వద్ద విజయపురం ఎస్ఐ వెంకటసుబ్బయ్య సీజ్ చేసి ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐతో పాటు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, దేవరాజులు, కానిస్టేబుల్‌శివశంకరప్ప,ఏళుమలైలు ఉన్నారు.

## గంగమ్మ హుండీ ఆదాయం

**రూ.16.86లక్షలు**



**తిరుపతి,మే 2ప్రభాతవార్త:**
తాతయ్య గుంట గంగమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి శాశ్వత హుండీల ద్వారా సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. 37రోజులకు నగదు 16,86,152 లక్షల రూనాయలు లభించింది. కందాల గోవిందాచార్యులు ట్రస్ట్ ఈఓపుట్టా రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ ,ఈఓ ఎ. జయకుమార్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది, సేవా కుటుంబం, ఈస్ట్ పోలీసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న అన్నమయ్య సంకీర్తనల గోష్టిగానం

**తిరుపతి,మే 2ప్రభాతవార్త:**



వేంకటేశ్వర స్వామికి పర మభక్తుడైన తాళ్లపాక అన్నమాచార్యుల 618వ జయంతి ఉత్సవాలు శని వారం తిరుపతి అన్నమా చార్య కళామందిరంలో భక్తి శ్రద్ధలతో ప్రారంభ మయ్యాయి.ఈ సందర్భ ంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, స్థానిక కళాకారులు కలిసి ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం భక్తులను భక్తిర సంలో ముంచెత్తింది. "బ్రహ్మకడిగిన పాదము..", "కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు..","నారాయణ తే నమో నమో..","ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన..","హరి అవతారమితడు అన్నమయ్య.." వంటి కీర్తనలు ఆలపించగా సభా వేదిక అంతా ఆధ్యాత్మిక సౌరభంతో నిండిపోయింది. అనంతరం హారతి, మహానివేదనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్, సంచాలరాలు డాక్టర్ లత, కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతుకోసం తీసుకెళ్లారు...



**అమర్చడం మరిచారు..**
**- పది నెలలు అయినా.. పట్టించుకోని అధికారులు**
**- తాగునీటికోసం అవస్థలు పడుతున్న గ్రామస్తులు**

**పులిచెర్ల, మే 2, ప్రభాతవార్త**
మండలంలోని మతుకువారి పల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ అమర్చకపోవడంతో త్రాగునీటి సమస్య ఎదురవు తున్నది. గ్రామంలో 10 నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ సమస్య రావడంతో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు కోసం తీసుకెళ్లారు. అయినా ఇంత వరకు ట్రాన్స్ ఫార్మర్ అమర్చలేదు.. ఇటీవల నిర్వహించిన కరంటోళ్ల జనబాట కార్యక్రమంలో ట్రాన్స్ ఫార్మర్ సమస్య అధికారుల దృష్టికి వచ్చిన అది వట్టి మాటగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. త్రాగునీటి బోర్లలో నీరు పుష్కలంగా ఉన్న ట్రాన్స్ ఫార్మర్ లేకపోవడంతో గ్రామంలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఓవర్ లోడ్‌తో త్రాగునీటి బోర్లు పనిచేయకపోవడంతో త్రాగునీటికి కష్టాలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నిరుపేదల ఆకలితీర్చిన సేవా కార్యక్రమం

**తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త**



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో అర్తాల అల్లయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించే నిత్య అన్నప్రసాద కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక ప్రభుత్వ మహిళా ప్రసూతి ఆసుపత్రి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేక మంది నిరుపేదలకు ఆహారం పంపిణీ చేశారు. పూతలపట్టు మండలం చితిపిరాళ్ల గ్రామానికి చెందిన కవిత వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించారు. ఆమె తండ్రి అకనంబట్టు త్యాగరాజ రెడ్డి నాలుగవ వర్ధంతి సందర్భంగా ఆయన ఆత్మశాంతి కోసం అన్నదానం నిర్వహించారు. అలాగే, కవిత కుమారుడు లిఖిత కుమార్ జాతీయ స్థాయిలో ఆర్ టి ఐ నేషనల్ కన్వీనర్‌గా ఎన్నికైన సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం విశేషం. కుటుంబ సభ్యులు లిఖిత కుమార్, జ్యోతీశ్వర్ రెడ్డి, మోక్షిత్, దియా శ్రీ పాల్గొని తమ తాతకు నివాళులర్పించారు.కార్యక్రమంలో ట్రస్ట్ వాలంటీర్లు తరుణ్, పూరి, సాయి, ధనుష్, భార్గవి చంద్రకళ, రమ్య, లిఖితలు సేవలందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు అర్తాల కేశవులు, అర్తాల ధన్యవాణి పాల్గొనగా, అర్తాల మునెమ్మ పర్యవేక్షణలో అర్తాల మురళి, అర్తాల తులసి కుమార్, అర్తాల ప్రసాద్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా కొనసాగుతున్న ఈ నిత్య అన్నప్రసాద కార్యక్రమానికి స్థానికంగా మంచి స్పందన లభిస్తోంది.

## రిస్మ్ విశ్వవిద్యాలయం ప్రారంభం..
## భవిష్యత్ నైపుణ్యాలకు దిశ

**తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త**
స్టెమ్, మేనేజ్‌మెంట్ విద్యను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ అనే డీమ్డ్ టుబి విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. ఈ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఎట్ అల్బనీ, స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్తో భాగస్వామ్యంలో ఏర్పాటవడం విశేషం.ఈ విశ్వవిద్యాలయం ఆగస్టు 2026లో తన తొలి విద్యా సంవత్సరాన్ని ప్రారంభించనుంది. ఇంజనీరింగ్, బిజినెస్, సైన్స్ విభాగాల్లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉంటాయి. ప్రారంభ దశలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ సైన్సెస్, బిబిఏ, ఎంబిఏ వంటి కోర్సులు ప్రవేశపెట్టనున్నారు.పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన పాఠ్య ప్రణాళికతో, మల్టీ డిసిప్లినరీ అభ్యాసం, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని కల్పించనున్నారు. అలాగే పరిశ్రమ నిపుణులు ప్రొఫెసర్స్ ఆఫ్ ప్రాక్టీస్ గా బోధనలో పాల్గొనడం ఈ విశ్వవిద్యాలయం ప్రత్యేకతగా నిలుస్తోంది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,విద్యార్థులను భవిష్యత్ ఉద్యోగాలకు మాత్రమే కాకుండా మారుతున్న ప్రపంచానికి తగిన నైపుణ్యాలతో సిద్ధం చేయడమే లక్ష్యమని తెలిపారు.రిస్మ్ ప్రధాన క్యాంపస్ బెంగళూరులో అభివృద్ధి చెందుతుండగా, పరిశ్రమలతో అనుసంధానమైన విద్యా విధానం ద్వారా విద్యార్థులకు విస్తృత అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.సమగ్ర అభ్యాస వాతావరణంతో విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి ఈ విశ్వవిద్యాలయం దోహదపడనుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

## తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న



**చంద్రగిరి, మే 2 ప్రభాతవార్త:**
శ్రీనివాస మంగాపురంలో వెలసి యున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం తిరుచ్చి వాహన సేవ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులను విశేష అలంకరణలతో తీర్చిదిద్దారు. తిరుచ్చి వాహనంపై అధిష్టించిన స్వామివారు తనదేవేరులతో తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం.!

**ఎంఎల్ఏ పులివర్తి నాని**

**రామచంద్రాపురం, మే 2 ప్రభాతవార్త:**



రైతు భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. శనివారం బ్రాహ్మణ కాల్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021వ సంవత్సరంలో కురిసిన అకాల వర్షాలకు బ్రాహ్మణ కాల్వ నీటము నిగిందన్నారు. నాటి హామీ మేరకు సిసి రోడ్డు నిర్మించి మాటకు కట్టుబడినట్లు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్టును అమలులోకి తీసుకువచ్చి రైతుల భూములను కొట్టేయాలని భావించినట్లు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాకతో నిష్పక్షపాతంగా భూములు రీ సర్వే నిర్వహించి రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రీ సర్వేలో మంజూరైన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్ధన్ చౌదరి, నాయకులు రావిళ్ళ గిరి, కొట్టే చంద్రశేఖర్ రెడ్డి, మునిచంద్ర నాయుడు, ఇన్‌చార్జ్ ఎంపిడిఓ గిడ్డయ్య, తహశీల్దార్ మధుసూదన్ రావు, ఏఓ మమత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ముదిరాజ్ సంఘం నేతల సహకారం

**సత్యవేడు, మే 2 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని మదనంబేడు జడ్పీ హైస్కూలులో పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థి విష్ణును స్థానిక ముదిరాజ్ సంఘం నేతలు శనివారం తన నివాసంలో ఘనంగా సత్కరించారు. విష్ణు మదనంబేడు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో 580మార్కులు సాధించి మండలానికి తృతీయ స్థానంలో రావడం జరిగింది. తమ సంఘానికి చెందిన ఈ విద్యార్థికి తమవంతు ప్రోత్సాహంగా 5001 ఆర్థిక సహాయం అందజేశారు. శాలువ, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్యవేడు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శివయ్య, మునిప్రతాప్, ఎన్‌టీఆర్ నగర్ శీను, పేరడం నాగరాజు, చిరంజీవి, బీసీ కాలనీ కుమార్, వెంకటేశ్వర్లు, రామారావు, సుబ్రహ్మణ్యం, హేమంత్, పృథ్వీ, దయా, రాజేష్, గురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉలవచేనులో పోలీసుల గార్డెన్ సెర్చ్

**సత్యవేడు, మే 2 ప్రభాతవార్త:**



సత్యవేడు మండల కేం ద్రంలోని ఉలవలచేను ప్రాంతంలో పోలీసులు గార్డెన్ సెర్చ్ నిర్వహిం చారు. జిల్లా ఎస్పీ సూ చనల మేరకు సత్యవేడు సీఐ మురళీనాయుడు పర్యవేక్షణలో ఎస్ఐలు సాయినాథ్ చౌదరి, లావ ణ్య ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఈ సర్చ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలపై తనిఖీలు నిర్వహించి స్థానిక ప్రజలకు గంజాయి, గుట్కా, మహిళా భద్రతాపై పలు సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడడంలో ప్రజలు పోలీసులకు ఎలా సహకరించాలని తెలియజేశారు. గార్డెన్ సర్చ్ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొని పరిసర ప్రాంతాలను సమగ్రంగా తనిఖీ చేశారు.

# తిరుపతి డివిజన్

## జననగణనలో పక్కా సమాచారం నమోదు చేయండి

**-ఇన్‌చార్జి కమిషనర్ శారదా దేవి**

**తిరుపతి,మే 2ప్రభాతవార్త:**



జననగణన 2027 భాగంగా సేకరించే సమాచారం పక్కాగా ఉండేలా చూడాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులు, సిబ్బందికి సూచించారు. జనన గణన 2027 లో బాగంగా ఇంటింటి నుండి సమాచారాన్ని సేకరించే విధానాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఆప్ ద్వారా ఏయే వివరాలను ఎలా నమోదు చేస్తున్నారనే విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జనన గణన ను పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలుపారు. జననగణన చేసేందుకు 625 మంది ఎన్యుమరేటర్లు, 71 మంది సూపర్ వైజర్లు, 21 మంది ఫీల్డ్ ట్రైనర్లు ఉన్నారని తెలిపారు. వారందరూ ఈ నెల 1 నుండి 30 వ తేదీ వరకు నగరంలోని ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తారని తెలిపారు. ఈ జననగణన లో ఎక్కడా పొరపాట్లు జరగకుండా అన్ని వివరాలు యాప్ లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు నరేష్, మోహన్, తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ బడి పిలుస్తుంది: అవార్డులందిస్తుంది!

**మార్కెటింగ్ కమిటి చైర్మెన్**

**శ్రీకాళహస్తి,మే 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని ఆర్‌పిబియస్ జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం 'బడి పిలుస్తుంది' కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ నిర్వహించిం ది. ఈకార్యక్రమాలకు శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ విద్యారంగంలో పలు కీలక మార్పులు తీసుకొచ్చారని చెంచయ్యనాయుడు వివరించారు. ఆయన కృషి ఫలితమే పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు టాప్ ర్యాంకులు సాధించారన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మూడు ఎసెంట్లు భూమి ఇవ్వటానికి ప్రకటించటం ప్రభుత్వ పారదర్శకతకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించటానికి నిదర్శనం అన్నారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి కెవియస్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు తమ సత్తా చాటి కార్పొరేట్ పాఠశాలలకు షాక్ ఇచ్చారన్నారు. ప్రత్యేకావసరాలు కల్గిన పదవ తరగతి పిల్లలు పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభను కనపరచి జిల్లాలో మొదటి స్థానం సాధించారన్నారు. ప్రత్యేకావసరాలు కల్గిన విద్యార్థుల్లో ప్రధమ స్థానం చంద్రగిరికి చెందిన మౌనిక (లో విజన్) ద్వితీయ స్థానాన్ని తొట్టంబేడు మండలంలోని కె.శ్రీకాంత్ (లో విజన్) తృతీయ స్థానాన్ని తిరుపతి అర్బన్‌మ ండలానికి చెందిన పి. త్రివేణి(హియరింగ్)లు సాధించారన్నారు.వారిని శనివారం శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ ఉన్నత(బాలుర) పాఠశాలలో విద్యాశాఖాధికారితో పాటు సహిత విద్య కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డిలలు అభినందించారు.ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వవెంకటయ్య, జడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డి,విద్యాశాఖకు చెందిన మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు

**చంద్రగిరి, మే 2 ప్రభాతవార్త:**



స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఆటో డ్రైవర్లు మే డే సందర్భంగా కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శ్రీ మూల స్థాన ఎల్లమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గంగుడుపల్లి, ఐతేపల్లి స్టాండ్‌లకు సంబంధించిన కార్మికులు పతాకావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకు లు మాట్లాడుతూ క్రమశిక్షణ, ప్రయాణికుల పట్ల గౌరవం, వృత్తిపట్ల అంకితబావం కలిగివుండాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసు నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.రవిచంద్రన్, జె.బాలకిషోర్, శ్రీరాములు, పి.చిరంజీవి రెడ్డి, ఆర్.రామకృష్ణ, బి.రాజేంద్రప్రసాద్, పరందామరెడ్డి, మునికృష్ణ, ఖాదర్ భాషా, రమేష్, గోపి, పి.రామారావు, సుబ్రమణ్యం, రవి, కామసాని రాజశేఖర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, వాసు, సురేష్, తదితరులు పాల్గొన్నారు

## కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్



**తిరుపతి కలెక్టరేట్, మే 2 ప్రభాతవార్త:**
స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్క రించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ.. మే 1 నుంచి జూన్ 11 వరకు జరిగే కిశోరి వికాసం ప్రత్యేక వేసవి శిబిరాన్ని బాల బాలికలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలి పారు. కౌమార బాలల వికాసమే లక్ష్యంగా కిశోరీ వికాసం కార్యక్రమం రూపొందించారని తెలిపారు. వివిధ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ తెలిపారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిలో ఈ శిబిరాల్ని నిర్వహించాలన్నారు. మహిళా హక్కులుసమానత్వం, ఆరోగ్య సంరక్షణ, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, విద్యావకాశాలు, సైబర్/ ఆన్లైన్ భద్రత, ఆర్థిక నిర్వహణ స్వావలంభన తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారిణి ఎస్. వసంత బాయి పాల్గొన్నారు.

## పదవ తరగతిలో దీక్షిత ప్రతిభ



**కేవీబీ పురం, మే 2 ప్రభాతవార్త:**
పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సిద్ధిరాజు దీక్షిత ప్రతిభకనబరచింది. విద్యార్థిని దీక్షిత 558 మార్కులతో స్టేట్ ర్యాంకు సాధించింది. ఈ విద్యార్థినిని ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. మా పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తెచ్చిందని విద్యార్థిని తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

## ఆరోగ్యం వైపు నడకకు నలభై ఏళ్లు

### న వాకర్స్ అసోసియేషన్‌లోగో ఆవిష్కరణ

**పుత్తూరు రూరల్, మే 2 ప్రభాతవార్త:**
పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ 40వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ రూపొందించిన కొత్త లోగోను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు శనివారం తిరుపతిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిరాజు మాట్లాడుతూ నలభై సంవత్సరాల క్రితం వైజాగ్‌లోని ఆర్‌కే బీచ్‌లో ఆళ్వార్‌దాస్ అనే వ్యక్తి పది మంది సభ్యులతో ఈ అసోసియేషన్‌ను ప్రారంభించారని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200 అసోసియేషన్లు ఏర్పడి, సుమారు నాలుగు లక్షల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. నడక వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, మరింత మందిని వాకింగ్‌వైపు ప్రోత్సహించడం ద్వారా సమాజాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వంటి సేవా కార్యక్రమాల్లో కూడా అసోసియేషన్ ముందంజలో ఉందని వివరించారు. అసోసియేషన్ చేపడుతున్న సేవలను జిల్లా కలెక్టర్ అభినందిస్తూ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కోనేటి రవిరాజు, కన్వెన్షన్ చైర్మన్ ప్రసాద్, శివారెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్డీఓ కార్యాలయంలో 4న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**తిరుపతిరూరల్, మే 2 ప్రభాతవార్త:**
తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి పరిధిలోని డివిజనల్ స్థాయి అధికారుల సమక్షంలో మే 4న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వచ్చే సమస్యలను నేరుగా స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కారం చూపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ, భూ వివాదాలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఇతర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతులు ఈ సమావేశంలో స్వీకరించబడతాయని తెలిపారు.


కెనరా బ్యాంక్ Canara Bank Together we can
తిరుపతి ప్రధాన-1 శాఖ, తిరుపతి, తిరుపతి జిల్లా

**రుణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు — తేది: 27.04.2026
**తనఖాదారు:** శ్రీమతి నాగప్రవీణ, భర్త నాగశ్రీనివాసులు, ఫ్లాట్‌నెం.308, శ్రీ రాధాగోవింద్ రెసిడెన్సీ, అక్కార్డ్ స్కూల్ ప్రక్కన, మంగళం శాఖ, ఉపాధ్యాయ నగర్, తిరుపతి - 517501
**రుణగ్రహీత :** శ్రీ నాగశ్రీనివాసులు, తండ్రి నాగసుబ్బయ్య ఫ్లాట్‌నెం.308, శ్రీ రాధాగోవింద్ రెసిడెన్సీ, అక్కార్డ్ స్కూల్ ప్రక్కన, మంగళం శాఖ, ఉపాధ్యాయ నగర్, తిరుపతి - 517501
అయ్యా/ అమ్మా !
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు
మా కెనరాబ్యాంక్, తిరుపతి ప్రధాన-1 శాఖ నుండి మీరు శ్రీ నాగశ్రీనివాసులు గారు కాలానుగుణంగా పొందిన లోన్స్/ రుణసౌకర్యాల వివరములు

| రుణ స్వభావం | మంజూరు చేసిన రుణం మొత్తం | ఖాతా నెంబరు | 27.04.2026 తేది నాటికి బకాయి మొత్తం | వడ్డీ రేటు(2% పీనల్ వడ్డీతో సహా |
|---|---|---|---|---|
| Housing Loan | Rs.37,00,000 | 1965619007228 | Rs.26,57,439.85 | 12.00 |
| Housing Loan | Rs.8,00,000 | 1965619007285 | Rs.2,30,487.67 | 10.95 |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసు షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు/ ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో విఫలమైనందున బ్యాంకు సదరు ఋణాన్ని **తేది:25.04.2026** నిరర్ధక ఆస్తిగా (ఎన్‌పిఏగా) వర్గీకరించినది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.28,87,927.52** పై **(ఇరవై ఎనిమిది లక్షల ఎనభై ఏడు వేల తొమ్మిది వందల ఇరవై ఏడు రూపాయల యాభై రెండు పైసలు మాత్రమే)**లను + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసినదిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసును జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కులను మేము వినియోగించుకుంటాము. అంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించ కుండా మీరు నిరోధింప బడుచున్నారు. సదరు చట్టం మరియు / లేదా అమలులో వున్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కులకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించు కోవడానికి ఉన్న కాల వ్యవధిని వినియోగించు కోగలరని సూచించడమైనది. మా శాఖ రికార్డులలో అందుబాటులో వున్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగినది.
**షెడ్యూలు: తనఖాలో వున్న ఆస్తి యొక్క వివరములు దిగువ తెలుపడమైనది.స్థిరాస్తి వివరములు:-** చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్‌జిల్లా, తిరుపతిసబ్ జిల్లా, తిరుపతి అర్బన్ మండలం, నెం.9 అక్కారంపల్లి గ్రామలెక్కదాఖలా సర్వేనెం.11/2బి/2 సబ్ డివిజన్ అనంతరం సర్వేనెం.11/2బి/2ఎ మరియు సర్వేనెం.11/2బి/2ఎ2 ఉపాధ్యాయ నగర్ రెసిడెన్షియల్ ఏరియాకు దక్షిణం వైపునున్న ఆర్.ఓ.సి. నెం.1803/జి1/2006, ఎల్.పి.నెం.65/జి1/ 2006 తేది: 11/10/2006 ద్వారా తుడా అప్రూవల్ పొందిన స్థలం విస్తీర్ణం ఎ.0.72 సెంట్లు. పై స్థలంలో వేసిన రోడ్డు వెడల్పుకు అవసరమైన స్థలాన్ని 1వ పార్టీ వదలివేసిన అనంతరం( విక్రయపత్రంనెం. 5396/2013 ప్రకారం) మిగిలిన ప్లాట్లు నెంబర్లు, 1,2,3,8,9,10.లో నిర్మించిన శ్రీ రాధా గోవిందరెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌కు హద్దులు: తూర్పు: 80అ. వెడల్పు గల రోడ్డు, పడమర: ప్లాటు నెం.4,7, ఉత్తరం: 40అ. వెడల్పు గల రోడ్డు, దక్షిణం: 40.అ. వెడల్పు గల రోడ్డు. **ఈ హద్దుల మధ్య** తూర్పు నుండి పడమర: ఉత్తరం వైపు: 168అ. లేదా 51.240 మీ. దక్షిణం వైపు: 166అ. లేదా 50.630మీ. ఉత్తరం నుండి దక్షిణం: తూర్పు వైపు: 112అ. లేదా 34.160మీ. పడమర వైపు: 113అ లేదా 34.465మీ. వెరశి మొత్తం స్థలం విస్తీర్ణం **18843.75 చ.అ. లేదా 2093.75 చ.గ. ఇందున అవిభాజ్యవాటా విస్తీర్ణం 48.94చ.గలు.** ఇందులో వున్న రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్, 3వ అంతస్తులోని తూర్పు ముఖం గల ఫ్లాట్ నెం.308 ఫ్లాట్ యొక్క విస్తీర్ణం 1602 చ.అ. కామన్ ఏరియాతో సహా. హద్దులు: తూర్పు: కామన్ కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై, ఉత్తరం: ఓపెన్ టు స్కై దక్షిణం: ఓపెన్ టు స్కై . **టైటిల్ హోల్డరు పేరు: శ్రీమతి నాగప్రవీణ భర్త ఎన్.శ్రీనివాసులు**

స్థలం : తిరుపతి — సం॥ అధీకృత అధికారి,
తేది: : 27.04.2026 — కెనరా బ్యాంక్

# సూళ్ళూరుపేట డివిజన్

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**



సూళ్ళూరుపేట, మే 2 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని సివి ఏపీ కార్యాలయంలో ఆమె ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చే సమస్యలను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే సహించే ప్రసక్తే లేదని ఆమె హెచ్చరించారు. అనంతరం ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు నియోజకవర్గ మొత్తం మీద 52 అర్జీలు వివిధ సమస్యలపై, ఎమ్మెల్యేకు ప్రజలు అందజేశారు. ముఖ్యంగా డ్రైనేజీలు, రోడ్లు మరమ్మతులు, విద్యుత్ సరఫరాను మెరుగు పరచాలని, భూ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేసారు. సమస్యలు అన్నింటిని పరిష్కరించి వాటి స్థితిగతులను అధ్యయనం చేసి సరైన సమయంలో అర్జీదారులకు న్యాయం చేయడం జరుగు తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, మండల తెలుగుదేశం రూరల్ పార్టీ అధ్యక్షులు పాకం వెంకటసుబ్బయ్య, పార్టీ సీనియర్ నాయకులు తిరువూరు సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, సీఐ ఎం మురళీకృష్ణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి!



వాకాడు, మే 2 ప్రభాతవార్త: రక్తదానం చేయండి ఆపదలో ఉన్న వారిని రక్షించండి అంటూ ఎం.వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ కోరారు. శనివారం మండల కేంద్రమైన వాకాడులో కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం.వి. రావు ఫౌండేషన్ 18వ వార్షికోత్సవ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రస్తుతం రక్త నిల్వలు అత్యధిక స్వల్పంగా ఉన్నందున ప్రతి ఒక్కరూ రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు వీలవుతుందని కావున స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. ముందుగా స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు ఆదిలక్ష్మి చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజలవన చేశారు. నెల్లూరు నోవా బ్లడ్ బ్యాంకు వారు రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎం.వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ కార్యదర్శి ఎం. విజయలక్ష్మి, వాకాడు పంచాయతీ కార్యాలయ సూపర్వైజర్ భీమయ్య నేతృత్వంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది తదితరులు రక్త సేకరణలో పాల్గొన్నారు. నోవా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దళితుల ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు.

## మండల సర్వసభ సమావేశం




దొరవారిసత్రం, మే 2 ప్రభాతవార్త: అధికారులు దుమ్మా సర్వసభ సమావేశంలో కనిపించని వైద్య అధికారులు దొరవారిసత్రం మండలంలో శనివారం ఎంపీడీవో కార్యాలయం నందు జరిగిన సర్వసభ సమావేశంలో ముఖ్యంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మండలంలో ఎక్కడ తాగునీటి సమస్య తల ఎత్తకుండా చూడాలని తెలిపారు. ఎండలపై ప్రజలకు జాగ్రత్తలు తెలపాల్సిన డాక్టర్లు ఈ సమావేశానికి రాకపోవడం కోసమెరుపు మండల తాసిల్దార్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం సెన్సస్ నమోదు చేసుకోవాలని తెలిపారు అంతే కాకుండా రైతులకు ప్రభుత్వం అందించే పాస పుస్తకాల విషయంలో ఏవైనా ఒడిదుడుకులు ఉంటే ఆయా సచివాలయాలు ఉండే విఆర్వోలుకు వద్దకు సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో సర్పంచుల పదవీకాలం ముగియడంతో 11 సచివాలయాలకు ప్రత్యేక అధికారులను నియమించామని ఎక్కడ ఏ సమస్య తలచిన అధికారుల దృష్టికి ప్రజలు తీసుకురావాలని తక్షణమే పరిష్కార దిశగా ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ, దువ్వూరు గోపాల్ రెడ్డి, మండల తహసిల్దార్ ఎం. రాజేంద్ర, ఎంపీడీవో గోవర్ధన్, మండల ఎస్సై జీవి చౌదరి అధికారులు పాల్గొన్నారు.

## డీజిల్, పెట్రోల్ కొరత కృత్రిమ సృష్టి : నేదురుమల్లి



వెంకటగిరి, మే 2 ప్రభాతవార్త : పెట్రోలు డీజిల్ కొరత కృత్రిమంగా సృష్టించేదని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తెలిపారు. శనివారం వైయస్సార్సీపి వెంకటగిరి నియోజకవర్గ నాయకులతో ఆయన ఎన్‌జేఆర్ భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిజమైన కార్యకర్తల గుర్తింపు అత్యంత ముఖ్యమని ఆయన తెలిపారు. సభ్యుల వివరాలు, మొబైల్ నంబర్లు, ఫోటోలు పూర్తిగా పరిశీలించి వెరిఫికేషన్ పక్కాగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామ/వార్డు స్థాయిలో అవగాహన కలిగిన నాయకులు కార్యకర్తలకు ఈ ప్రక్రియ పై దిశా నిర్దేశం చేయాలని సూచించారు. పార్టీ సభ్యత్వం కోరే ఎంతమంది కార్యకర్తలకైన స్థానం ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం వైఎస్ఆర్సిపి శ్రేణుల లక్ష్యంగా పనిచేయాలన్నారు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని వైఎస్ఆర్సిపి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో ఉండేలా చూసే బాధ్యతతో పాటు అనర్హులను జాబితా నుంచి తొలగించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత పార్టీ కార్యకర్తలపై ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడిన డీజిల్ కొరత పూర్తిగా కృత్రిమమైందేనని పేర్కొన్నారు. డీజిల్ కృత్రిమ కొరత కారణంగా రైతులు, రవాణా రంగం, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ పనుల సమయంలో ఇంధన కొరత రావడం రైతులకు భారీ నష్టాలను కలిగిస్తుందని అన్నారు.

## 4న మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్

బాలాయపల్లి, మే 2 ప్రభాతవార్త: బాలాయపల్లి తహసిల్దార్ వారి కార్యాలయం నందు ఈ నెల 4వ తేదీన సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ విజయలక్ష్మి తెలిపారు. అందరు మండల స్థాయి అధికారుల సమక్షంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజలు తమ సమస్యలను నేరుగా సంబంధిత శాఖల అధికారులకు తెలియజేసి, నిర్దిష్టమైన కాలవ్యవధిలో పరిష్కారం పొందేందుకు ఒక సమర్థవంతమైన వేదికను అందించడం లక్ష్యంగా ఉంటుందన్నారు. రెవెన్యూ, భూ వివాదాలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు మరియు ఇతర ప్రజా సేవలకు సంబంధించిన సమస్యలు ఈ కార్యక్రమంలో స్వీకరిస్తారని తెలిపారు.

## విద్యుత్ సబ్సిడీ చేరేలా చర్యలు తీసుకోండి : ఎంపీ మద్దెల



వెంకటగిరి, మే 2 ప్రభాతవార్త: అర్హులైన వారందరికీ విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని జిల్లా విద్యుత్ కమిటీ చైర్మన్,ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణవనం పవర్ లూమ్స్ సమస్య, చిట్టమూరు మండలంలోని ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ సరైన విధంగా అందకపోవడం వంటి అంశాల గురించి ఎంపీ వివరాలు కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సబ్సిడీ అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాలు సబ్సిడీ పరిధిలోకి రాకపోవడం వల్ల రైతులు, చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకంపై పట్టణ ప్రాంతాల్లో సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రజలకు ఈ పథకం ప్రయోజనాలు చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అలాగే వ్యవసాయ అవసరాల కోసం పీఎం కుసుమ్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తీర, మెట్ట ప్రాంతాలలో విద్యుత్ సౌకర్యం అందుబాటులో లేని ప్రాంతాల్లో సోలార్ ఎనర్జీపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్న ప్రజలను దృష్టిలో ఉంచుకుని అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఈ పథకాలు వారికి చేరువయ్యేలా చేయాలని సూచించారు. గ్రామాలలోని చెరువు కట్టల వద్ద సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అవకాశాలపై ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదనంగా గ్రామాల్లో విద్యుత్ నష్టాలను తగ్గించేందుకు వీధి దీపాలను ఆటోమేటిక్ వ్యవస్థలతో అమలు చేయాలని, దీని ద్వారా విద్యుత్ ఆదా చేయడంతో పాటు నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. ఈ చర్యలన్నీ సమర్థవంతంగా అమలు అయితే ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరడంతో పాటు విద్యుత్ వినియోగంలో సామర్థం పెరుగుతుందని ఎంపీ అభిప్రాయపడ్డారు.

## శ్రీ షిర్డీ సాయినాధుని మందిర 22వ వార్షికోత్సవం



సూళ్ళూరుపేట, మే 2 ప్రభాతవార్త: సూళ్ళూరుపేటలోని సాయి నగర్లో వెలసి ఉన్న శ్రీ షిరిడి సాయినాధుని మందిరం స్థాపించి 22 సంవత్సరాలు అయిన సందర్భంగా పురస్కరించుకొని వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా ఆలయ వ్యవస్థాపకులు మొగల్లూరు బాల సుబ్రహ్మణ్యం శెట్టి ఆధ్వర్యంలో సాయి నాధునికి ఉదయం గణపతి పూజ, గోపూజ, హోమం నిర్వహించి సాయినాధునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం కన్నుల పండువగ సాయి నాధుని గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జనగణనకు ఖచ్చితమైన సమాచారం ఇవ్వండి: తహసిల్దార్



దొరవారిసత్రం, మే 2 ప్రభాతవార్త: జనగణన క్షేత్రస్థాయిలో పరిశీలించిన మండలం తహసిల్దార్ ఏకొల్లు గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్వే సక్రమంగా జరుగుతుందా లేదని పరిశీలించారు. సర్వే సిబ్బందితో మాట్లాడుతూ ప్రజల నుండి ఖచ్చితమైన సమాచారాన్ని పొందుపరచాలని సూచించారు. ప్రజలు సరైన సమాచారాన్ని అందించే విధంగా అవగాహన ఇచ్చారు. జనగణన ప్రతి 11 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుందని కరోనా కారణంగా 2021 జరగాల్సిన జనగణన పోవడంతో ఇప్పుడు ఈ జనగణన కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని మీ వద్దకు వచ్చి సర్వే అధికారికి ఖచ్చితమైన డేటా అందించాలని ప్రజలను కోరుతున్నామన్నారు.

## పార్టీ బలోపేతంపై దృష్టి సారించండి



సూళ్ళూరుపేట, మే 2 ప్రభాతవార్త: సూళ్ళూరుపేట నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు నేతలు, కార్యకర్తలు సమన్వయంతో కలసి పనిచేయాలని జనసేన పార్టీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు తెలిపారు. శనివారం హైదరాబాదులో నాగబాబును కలసిన సుళ్ళూరుపేట జనసేన పార్టీ నేతలతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి రోజురోజుకు మెరుగవుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసే విధంగా ప్రణాళికబద్ధంగా పనిచేయాలని నాగబాబు సూచించారు. మహిళలు, యువత పార్టీ పట్ల ఆకర్షితులయ్యే విధంగా మంచి కార్యక్రమాలను వినూత్నంగా చేపట్టాలని కోరారు. రాబోయే ఎన్నికల నాటికి పార్టీనిఅన్ని విధాలుగా సిద్ధం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, స్థానిక నేతలు షేక్ మా భాష, నక్క హరిబాబు, ఆవుల దాస్, ఎం బేటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవికాలంలో నిమ్మ, ఉద్యానవన పంటలను కాపాడుకోవాలి

**- నిమ్మ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం రామయ్య**



వెంకటగిరి, మే 2 ప్రభాతవార్త: వేసవి కాలంలో నిమ్మ, ఉద్యానవన పంటలను కాపాడుకోవాలని నిమ్మ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం రామయ్య తెలిపారు. శాస్త్రవేత్తలు బృందం పల్లెల్లో నిమ్మ, మిరప మల్లె తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెంబర్ అయితే వేరు కుళ్ళు, మంగునల్లి, ఎగిరే పేను వల్ల సంభవించు నష్టాలు గురించి వివరించారు. తెగుళ్ళ లక్షణాల గురించి కూడా రైతులకు తెలియజేశారు. తగిన మందులు వాడి రక్షించుకోవాలని తెలిపారు. ఉద్యానవన పంటల్లో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వేసవికాలంలో పంటలను రక్షించుకోవాలని తగుసూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు తిరుపాలు, శివరూపా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి సిబ్బందికి కార్యాలయం లేక అవస్థలు



వెంకటగిరి మే 2 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకం సిబ్బందికి కార్యాలయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత మండల పరిషత్ కార్యాలయం వరండాలోనే సిబ్బంది తమ విధులను నిర్వహిస్తున్నారు. కార్యాలయం ఆవరణలో విధులు నిర్వహిస్తున్న అందువల్ల కార్యాలయానికి వచ్చే పోయే వారి వల్ల ఇబ్బందులు కలుగుతున్నట్లు సిబ్బంది వాపోయారు. రికార్డులను కూడా ఎక్కడ దాచుకోవాలో అర్థం కావడం లేదని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయ పథకంకి కార్యాలయం లేదు. వారవోలు పంచాయతీకి చెందిన ఉపాధి హామీ పథకం రికార్డులు కూడా చోరీ గురయ్యాయి. ఉపాధ్యాయ పథకం సిబ్బంది కార్యాలయం లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులైన చర్యలు తీసుకొని కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు.

## గ్రంథాలయంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ



సూళ్ళూరుపేట, మే 2 ప్రభాతవార్త: విద్యార్థులలో వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి, భాషా పరమైన భయాలను పోగొట్టడానికి స్థానిక శాఖా గ్రంథాలయంలో కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్‌మెంట్‌పై శిక్షణా తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో భావ వ్యక్తీకరణ అనేది విజయానికి మూలస్తంభం వంటిదని, అందుకే తెలుగు, ఇంగ్లీషు భాషలలో మాట్లాడే, విద్యార్థులు తెలుగులో స్పష్టమైన ఉచ్చారణ, సరళమైన పదప్రయోగంతో ప్రసంగించడంపై శిక్షణ, ఆంగ్లంలో ప్రాథమిక సంభాషణల రోజువారీ వాక్యాల ప్రయోగంపై అవగాహన, సృజనాత్మక రచనలు, వ్యాసరచన, లేఖలు వ్రాసే పద్ధతులను నేర్పించడం, భాషా దోషాలు లేకుండా, అందమైన హ్యాండ్ రైటింగ్‌తో వ్రాయడంపై ప్రత్యేక కృత్యాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, బిడిసియల్ వంకా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జన గణనపై అపోహపడాల్సిన అవసరం లేదు



వెంకటగిరి, మే 2 ప్రభాతవార్త : జనగణన పై ఎవరో అపోహ పడాల్సిన అవసరం లేదని తహశీల్దారు పి శిరీష తెలిపారు. జనన గణన కొరకు వెంకటగిరి రూరల్ మండలం నందు 47 మంది ఎన్యూమరేటర్లు, 11 మంది సూపర్ వైజర్లను నియమించడం జరిగినదని చెప్పారు. వీరికి అదనంగా ఐదుగురు ఎన్యూమరేటర్లు, ఇద్దరు సూపర్ వైజర్లు రిజర్వు నందు భాధ్యతలు నిర్వర్తిస్తారని వివరించారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు అందరికి ఇప్పటికే శిక్షణా తరగతులు పూర్తి చేయడం జరిగినదని తెలిపారు. జన గణన నందు ప్రజలను మొత్తం 34 రకాల ప్రశ్నలు అడిగి ఎన్యూమరేటర్లు సమాచారము సేకరిస్తారని తెలియపరిచారు. జనగణన ప్రక్రియ నందు ప్రజలు అందరు స్వచ్ఛందంగా సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## 4న మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్

వెంకటగిరి, మే 2 ప్రభాతవార్త: మండలం మండల పరిషద్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయం నందు ఈ నెల 4వ తేదీన సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. అందరు మండల స్థాయి అధికారుల సమక్షంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## వెంకమనాయుడు అంతక్రియల్లో నెలవల

పెళ్లకూరు, మే 2, ప్రభాతవార్త:చిల్లకూరు పిఏసిఎస్ చైర్మన్ కేవీ నాయుడు తండ్రి కొచ్చర్ల వెంకన్న నాయుడు శుక్రవారం వడదెబ్బ కారణంతో మృతి చెందిన విషయం విధితమే. శనివారం రావులపాడులో జరిగిన వెంకన్న నాయుడు అంతక్రియలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం మండల తెదేపా నాయకులతో కలిసి పాల్గొని అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, టిడిపి సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు వేలూరు. మురళీకృష్ణ రెడ్డి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి శిరసునం, భేటీ చైతన్య కృష్ణారెడ్డి, నాగేందర్ రెడ్డి, మాధవరెడ్డి, పాపాడి రాజారెడ్డి, పొనబాక పోలయ్య, నూతలపాటి ప్రసాద్ నాయుడు, పాలచూరు నరేంద్ర రాపూరు, పరశురాం పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధిలో కూటమి పాత్ర కీలకం

**-శ్రీకాళహస్తిలో రాజీవ్‌నగర్ : ఎస్‌సివి**



శ్రీకాళహస్తి,మే 2 ప్రభాతవార్త: సామాజిక సేవతో, ప్రజల మనస్సులను గెలవచ్చునని ఐదేళ్ల రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసిన పాలకుల నుంచి నేడు కూటమి ప్రభుత్వం ప్రగతి వైపు పరుగులు తీయించటంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, యువ నేత విద్యాశాఖా మంత్రిలోకేష్, పంచాయతీరాజ్ వ్యవస్థను చక్కదిద్దటంలో పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు.శనివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజక వర్గం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారం ఎంతో ఉందన్నారు. తాను శాసనసభ్యుడుగా ఉన్నప్పుడు పట్టణ నిరుపేదల కోసం రాజీవ్‌నగర్‌ను సృష్టించామ న్నారు. ఇక్కడ ఏడువేల ఇళ్ళను నిరుపేదలకు అందించామన్నారు. అలాగే తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు శ్రీకాళ హస్తి నియోజకవర్గాన్ని ఆధ్యాత్మిక దివ్యక్షేత్రంగానే కాకుండా విద్యామండలిగా తీర్చి దిద్దుటకు ఉన్నత విద్యా సంస్థలను కేంద్రం నుంచి సాధించటంలో ప్రస్తుత ముఖ్యమంత్రి కీలకం అన్నారు.

**జలదాత చంద్రబాబునాయుడు:**

శ్రీకాళహస్తి,సత్యవేడు నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయటానికి నాడు నారాచంద్రబాబునాయుడు ఎంతో సహకరించారని మాజీ ఎంఎల్‌ఏ ఎస్‌సివి నాయుడు అన్నారు. తెలుగుగంగ నుంచి చెరువులకు నీటిని అందించుటకు తూములు ఏర్పాటుకు ఆయన సహకారం వర్ణించనలవి కానిది. అంతేకాక పంట కాలువల నిర్మాణానికి సత్యవేడు నియోజకవర్గంలో ప్రత్యేక అనుమతి ఇచ్చిన ప్రదాత చంద్రబాబు నాయుడు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 1999లో చెన్నైకు మంచినీటిని అందించుటకు తెలుగుగంగ కాలువను ప్రారంభించి చెన్నైకు సాగునీటితో పాటు తిరుపతి,శ్రీకాళహస్తి దాహార్తిని తీర్చుటకు మంచినీటిని అందించిన ఘనత చంద్రబాబునాయుడుదే అన్నారు. అంతేకాక 2017లో శ్రీకాళహస్తీశ్వ రాలయం చుట్టుపక్కల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్‌ను అందించారని ఎస్‌సివి నాయుడు ఆన్నారు.

## చెన్నకేశవుని కళ్యాణం కడురమణీయం





శ్రీకాళహస్తిరూరల్,మే 2 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కళ్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కళ్యాణం కమనీయం స్వామి అమ్మవార్ల కళ్యాణం అంటూ గ్రామస్తులు పాటలు పాడుకుంటూ కళ్యాణ వేదిక వద్దకు చేరారు.కళ్యాణోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి కార్యనిర్వహణాధికారి బికె వెంకటేశులుఆదేశాలతో సారెను అందించారు. కళ్యాణం సందర్భంగా ఆలయానికి ఓ కళ్యాణ వేదికగా ముస్తాబు చేసారు. ఊరంతా విద్యుత్‌దీపాల కాంతితో శోభాయమానంగా తీర్చి దిద్దారు.వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా నేటి తరానికి వివాహ వ్యవస్థకు సంబంధించిన అవగాహనకు ఏర్పాట్లు చేసారు. ఆలయ అర్చకులు జనార్ధన శర్మ, రమేష్ స్వామిలు సారధ్యంలో కళ్యాణ తంతు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో డెప్యూటి ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఒ హేమామాలిని. సూపరింటెండెంట్ రవి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య సహయకుడు దుర్గా ప్రసాద్,యోగిష్ ఉభయ దారులు అనిల్‌రెడ్డి,జంగాల పల్లి తులసీరాంరెడ్డి,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోండి : ఆర్డీఓ

శ్రీకాళహస్తి, మే 2 ప్రభాతవార్త: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన నిర్వహించబోయే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారులంతా పిజీఆర్ఎస్ కార్యక్రమానికి హాజరు కావాలని, ప్రజలు ఒకే వేదిక వద్ద వారి సమస్యలను అర్జీల రూపంలో విన్నవించుకోచ్చునని అన్నారు.

## ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే శ్రద్ధ

**-జనవాణిలో 52 వినతులు స్వీకరణ**

**-అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి హామీ**




తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 52 వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను నేరుగా విని, సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తిరుమలలోఅర్థాంతరంగా నిలిచిపోయిన సచివాలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరగా, ఈ విషయాన్ని అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే వినాయకసాగర్‌లో పాడైన ఓపెన్ జిమ్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతి చేశారు.పీవీ ప్రసాద్ నగర్‌లో డ్రైనేజీ కాలువల నిర్మాణంపై కాలనీ ప్రతినిధులు వినతి పత్రం అందజేయగా, సమస్య సాధ్యాసాధ్యాలను పరిశీలించి పరిష్కరించాలని కార్పొరేషన్ ఎస్.ఈ. శ్యాంసుందర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఓ రవి, డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రయ్య, డీఈ లలిత కుమారి, ఎస్పీడీసీఎల్ ఏఈ ఉమాపతి, పి4 ప్రతినిధులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పలాయగుంటలో గ్రామోత్సవం



వడమాలపేట, మే 2 ప్రభాతవార్త: అప్పలాయగుంటలో అభయహస్తంతో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం ఊంజల్‌సేవ, గ్రామోత్సవం ఘనంగా జరిగింది. వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చి గంటపాటు ఊయల లూపారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన శ్రీనివాసుడు మాడా వీధుల్లో విహరించారు. స్థానిక భక్తులు దూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్యాక్సీ ఆటోడ్రైవర్లు మర్యాదపూర్వకంగా మెలగాలి



తిరుపతి, మే 2 ప్రభాతవార్త: తిరుపతి యాత్రాస్థలం కావడంతో ట్యాక్సీ ఆటోడ్రైవర్లు యాత్రికులు, ప్రయాణీకుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని ట్రాఫిక్ డిఎస్పీ డి.కొండయ్యానాయుడు సూచించారు. ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమ నిబంధనలు, ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వక ప్రవర్తన, క్రమశిక్షణతో విధులు నిర్వహించాల్సిన అవసరంపై శనివారం ఉదయం అవగాహన కల్పించారు.జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రామచంద్ర పుష్కరిణి వద్ద ఆటో డ్రైవర్లకు ప్రత్యేక ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రైవర్లు ప్రజల వద్ద అధిక చార్జీలు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలువడిన నేపథ్యంలో, అధికారులు ఈ అంశంపై ప్రత్యేకంగా స్పందించారు. ప్రయాణికుల నుండి నిర్ణీత చార్జీలకు మించి డబ్బులు వసూలు చేయడం చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలు ప్రజల్లో ఆటో డ్రైవర్లపై నమ్మకాన్ని దెబ్బతీస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ డి. కొండయ్య నాయుడు, సీఐ సంజీవి కుమార్ ,రైటర్ వెంకటేశ్,ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఐఐటి ఫౌండేషన్‌లో... యేషితకు ప్రశంసలు



గీతం స్కూల్ కరస్పాండెంట్ తమ్మినేని వెంకటేశ్వర్లు నుంచి ఐ ఐ టి ఫౌండేషన్ కోర్సులో బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ సర్టిఫికెట్ తీసుకుంటున్న పావులూరు ఏషిత. ఉపాధ్యాయులు అభినందపలు తెలిపారు.

ప్రభాతవార్త-తిరుపతి



## 4న ప్రజావేదిక సమస్యలు పరిష్కారం

**తొట్టంబేడు, మే 2 ప్రభాతవార్త**

తొట్టంబేడు మండలం పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ తొట్టంబేడు మండలం పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజల సమస్యలన్నింటినీ ఒకే చోట పరిష్కరించాలనే ఉద్దేశంతో, అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అదేవిధంగా ప్రాథమిక మండల స్థాయి సమస్యల పరిష్కారం కోసం అన్ని శాఖలు ఒకే చోట సమన్వయం చేసి, అన్ని రకాల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించడానికి వీలుగా, మండల స్థాయి అధికారులందరూ ఒకే చోట అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసామన్నారు. ఫిర్యాదు అందజేసిన ప్రతి ఒక్కరికీ అధికారికంగా ఒక రశీదు కాపీ (అక్నాలజీమెంటు) ఇవ్వబడుతుందని, కేటాయించిన సమయం లోపు మీ సమస్య పరిష్కారం కాకపోతే, సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించడానికి ఈ రశీదు ఉపయోగపడుతుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బడికి పంపుదాం.. మన పిల్లల్ని చదివిద్దాం:

### మాజీ సర్పంచ్ కడివెళ్ళ చెంగల్ రాజు

**ఏర్పేడు, మే 2 ప్రభాతవార్త**



ఎంఈఓ ప్రేమలత ఆధ్వర్యంలో బడి పిలుస్తోంది ప్రచార భేరి ద్వారా ఏర్పేడు మండలం మడిబాక గ్రామపంచాయతీ రాజులకండ్రిగ ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల సరస్వతి, రత్నకుమార్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గ్రామస్థులు కలిసి ఇంటింటికి వెళ్తున్నారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా, మెరుగైన సదుపాయాలు( మరుగుదొడ్లు, తాగునీరు, డిజిటల్ క్లాస్ రూమ్ లు) ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్నామన్నారు. రత్నకుమార్ మాట్లాడుతూ అర్హత కలిగిన ఉపాధ్యాయులచే బోధన, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్ నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించబడుతుందన్నారు. అరుణ్ కుమార్ మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ మార్గం అన్నారు. పదవ తరగతి చదివిన కందాడు హై స్కూల్ విద్యార్థిని వెన్నెల 570మార్కులు సాధించి ఏర్పేడు మండలంలో ద్వితీయ స్థానాన్ని పొందడం, సురపు రాజు యుగంధర్ రాజు కుమార్తె జస్మితా 578 మార్కులు సాధించడం పట్ల ఎంఈఓ ప్రేమలత అభినందిస్తూ శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ మంజుల గ్రామస్థులు, పిల్లల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## వాణి విద్యామందిర్ విద్యార్థులకు సత్కారం

**తొట్టంబేడు, మే 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని వాణీ విద్యామందిర్‌లో శనివారం నిర్వాహకులు పది పరీక్షా ఫలితాల్లో పట్టణ స్థాయిలో మూడవ స్థానం సాధించి పాఠశాల పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసిన విద్యార్థులను సత్కరించారు. ఫలితాల్లో పాఠశాల నుంచి హాజరైన విద్యార్థి టి.ధనూష్‌ను ఘనంగా సత్కరించారు. ఆతన్ని తీర్చి దిద్దిన తల్లి అరుణతో పాటు పాఠశాల కరస్పాండెంట్ విద్యాసాగర్ సత్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ ఆశీర్వదిస్తూ భవిష్యత్తులో మంచి మార్కులు సాధించాలని బేసిక్‌గా వాణీ విద్యామందిర పేరుప్రతిష్టలనుఇనుమడింపజేయాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థి భవిష్యత్తు చదువుకు రూ.10,116ల చెక్కుతో పాటు మెమొంటో డిక్షనరీలు అందించారు. దుశ్శాలువతో సత్కరించారు. పదవ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు 592 మార్కులు సాధించారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దనూష్ బేబీక్లాస్‌నుంచి వాణీమందిర్‌లోనే చదవటం అభినందనీయమని విద్యాసాగర్ ప్రశంసించారు.

## డ్రైవర్ అనుమానాస్పద మృతి

**రేణిగుంట, మే 2 ప్రభాతవార్త**



రేణిగుంట మండలం తూకివాకం డంపింగ్ యార్డ్ వద్ద శనివారం లారీ డ్రైవర్ రమేష్ (46) మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. అందిన సమాచారం మేరకు వివరాలు ఇలా.. రేణిగుంట మండలం మర్రి గుంట గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రమేష్ ఏప్రిల్ నెల 28వ తేదీ ఇంటి వద్ద డ్యూటీ కి అని చెప్పి వెళ్లాడు. ఏప్రిల్ నెల 30వ తేదీ రాత్రి ఇంటికి వస్తున్నట్లు ఫోన్ చేసి చెప్పాడు. ఫోన్ చేసి మూడు రోజులైనా ఇంటికి రాలేదని మే 2 తేదీ శనివారం తూకివాకం పంచాయతీ డంపింగ్ అతను మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియలేదు. అతని భార్య భర్త మృతి పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గాజుల మండ్యం పోలీసులు సంఘటనా స్థలం చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా ఆసుపత్రికి తరలించారు.

## రేణిగుంటలో గాలివాన...

### సేదతీరిన రేణిగుంట వాసులు... ఇబ్బందులు పడ్డ చిరు వ్యాపారులు....




**రేణిగుంట మే 2 ప్రభాతవార్త**

శనివారం మధ్యాహ్నం రేణిగుంట పట్టణం నం దు ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై దాదాపు రెండు గంటల పాటు గాలులతో కూడిన వర్షం పడింది. అకాల వర్షంతో రేణిగుంట పట్టణంలోని చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అమ్ముకోవలసిన వస్తువులు పూర్తిగా తడిసి పోయా యి. రేణిగుంట పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. శ్రీవారి దర్శనానికి వచ్చిన దూరప్రాంత యాత్రికులు రైల్వే స్టేషన్ వద్ద వర్షపునీరు చేరడంతో నీటిలోనే నడుచుకుంటూ వెళ్లారు. కొన్ని దుకాణాలకు చెందిన రేకులు గాలి వాన కారణంగా ఎగిరి కింద పడ్డాయి ముందు ఏర్పాటు చేసుకున్న పట్టలు ఎగిరిపోయాయి. వర్షం పట్టణంలో నానా బీభత్సం సృష్టించినప్పటికీ ఇంతకాలం విపరీతమైనఎండలవల్లగ్రీష్మ తాపానికి గురైన రేణిగుంటవాసులు వాతావరణం చల్లబడడంతో సేద తీరారు...

## రేణిగుంటలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**రేణిగుంట, మే 2 ప్రభాతవార్త**



రేణిగుంట తహసిల్దార్ కార్యాలయంలో మే నెల 4 తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు రేణిగుంట తహసిల్దార్ శ్యాం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలను ఒకే చోట సత్వరమే పరిష్కరించడానికి పి జి ఆర్ ఎస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మండల స్థాయి అన్ని శాఖల సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ఇతర శాఖల కార్యాలయాలను ఆశ్రయించాల్సిన అవసరం లేదన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తహసిల్దార్ కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరికి రసీదులు ఇస్తామన్నారు. రసీదులు తీసుకున్న తీసుకున్న వారికి కాల పరిమితి లోపల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. జిల్లాస్థాయి, రెవిన్యూ డివిజన్ స్థాయి సమస్యల పరిష్కారానికి మాత్రమే జిల్లా కలెక్టర్, ఆర్డిఓ కార్యాలానికి వెళ్లాలని మండల స్థాయి అన్ని శాఖల సమస్యల పరిష్కారం కోసం తహసిల్దార్ కార్యా లయంలో అర్జీలు సమర్పించవచ్చునని తెలిపారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



## ఘనంగా శ్రీరాములవారి పుష్పపల్లకి

**కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

కుప్పం పట్టణం రాధాకృష్ణ రోడ్ లో నెలకొని ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారి పుష్ప పల్లకి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి పుష్ప పల్లకిలో పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**శ్రీకాళహస్తి, మే 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి అన్నారు. శనివారం శ్రీకాళహస్తి ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా డీఈవో కెవిఎస్‌కుమార్, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు విచ్చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గురువారెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు కూట మి ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరాల ద్వారా విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, యోగ, స్పోకెన్ ఇంగ్లీష్, వేదిక్ మేథ్స్ తదితర అంశాలను నేర్పిస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాలను 5వ తరగతి నుండి 10 విద్యార్థులు వినియోగించుకొని నైపుణ్యాన్ని పెంచుకోవాలని చైర్మన్ పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డిని డీఈఓ సిబ్బంది శాలువాతో సత్కరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా ప్రభుత్వం వేసవి విజ్ఞాన శిబిరాలలో పాల్గొని నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సమ్మర్ క్యాంపుని ఉపయోగించుకుని తమ నైపుణ్యాన్ని వెలికి తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, మార్కెట్ కమిటీ చైర్మన్ గ్రంథాలయ ఉమ్మడి జిల్లా చైర్మన్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపగ్రంథాలయ అధికారి లావణ్య, గ్రంథాలయ అధికారి హరిక్రిష్ణ, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు చంద్రశేఖర్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ ఆర్ముగం, మహేష్ రెడ్డి, బాలాజీ ఉపాధ్యాయులు రిటైర్డ్ ఉద్యోగులు రీడర్స్ పెద్ద ఎత్తున విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం రేవతి ఆధ్వర్యంలో క్రాఫ్ట్ వర్క్ తయారుచేసిన వాటిని పిల్లలతో కలిసి పరిశీలించారు.

## 6న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రమాణ స్వీకారం

**శ్రీకాళహస్తి, మే 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలో నూతనంగా శ్రీకాళహస్తి చాంబర్ ఆఫ్ కామర్స్ ఈనెల 6న ఏర్పాటు చేసినట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరామగుప్తా(రాముగుప్తా) శనివారం తెలిపారు. ప్రమాణ స్వీకారం జయరాం రావు వీధిలోని సరస్వతి ఆడిటోరియంలో శ్రీకాళహస్తి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం చేయనున్నారు. ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, రాష్ట్ర మరియు జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కెవి చౌదరి, కార్యదర్శి కె.రఘురామిరెడ్డి, తిరుపతి పట్టణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.మోహన్‌కుమార్‌రాజు, గౌరవ సలహాదారు ఛార్టడ్ అకౌంటెంట్ టి.మల్లికార్జున్ , ప్రతినిధులు మరియు పట్టణంలోని వివిధ వ్యాపార సంఘ ప్రతినిధులు , అన్ని రకాల వ్యాపార దుకాణదారులు... మొదలైన వాళ్ళు పాల్గొంటారని జిల్లా వైస్ ప్రెసిడెంట్ సుబ్బరామ గుప్తా శనివారం విలేకరులకు తెలిపారు. సమావేశంలో జిల్లా మెంబర్లు సురేంద్రబాబు, స్వరూప్, కుట్టి, బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సద్విచారణ జ్ఞాన సాధన సదస్సు

**శ్రీకాళహస్తి, మే 2 ప్రభాతవార్త**



పట్టణంలోని సుఖ బ్రహ్మాశ్రమం సమీపంలోని శ్రీచైతన్య క్షేత్రం శ్రీస్వరాజ్య సంఘం నందు మే 1, 2, 3 తేదీలలో సద్విచారణ జ్ఞాన సాధన సదస్సు నిర్వహించను న్నారు. రెండవ రోజు శనివారం అధ్యక్షులు శ్రీరామ చైతన్య స్వామి అధ్యక్షతన స్థానిక రామలింగ ఆశ్రమం అధ్యక్షులు మోనస్వామి, పరబ్రహ్మ ఆశ్రమం పరమాత్మ నందగిరి స్వామి ప్రొద్దుటూరు శ్రీ స్వరాజ్య సంఘం అధ్యక్షులు శ్రీవద్ది నరసింహులు ముఖ్య అతిథులుగా విచ్చేసి అనుగ్రహభాషణాలను అందించారు. శ్రీవద్ది నరసింహులు మాట్లాడుతూ శ్రీ చైతన్య క్షేత్రం శ్రీ స్వరాజ్య సంఘం అధ్యక్షులు శ్రీరామ చైతన్య స్వామి చేసిన నిర్విరామ కృషి గురించి తెలియజేశారు. శ్రీరామ చైతన్య స్వామి 15 సంవత్సరాల వయసు నుండి బ్రహ్మజ్ఞాన సాధనకై అన్వేషిస్తూ 1986లో శ్రీకాళహస్తి శుక బ్రహ్మ ఆశ్రమం వార్షికోత్సవ నిమిత్తమై విచ్చేసి అక్కడ బ్రహ్మ విద్యా పాఠశాలలో బ్రహ్మవిద్య అధ్యయనం చేసి దాదాపు 12 సంవత్సరములు శుక బ్రహ్మ ఆశ్రమంలో గీతా అధ్యాపకులుగా పనిచేసి తదుపరి 1998లో శ్రీ చైతన్య క్షేత్రం నెలకొల్పాలనే సంకల్పంతో దగ్గరలో ఒక చిన్న కుటీరంలో ఆశ్రమం నిర్మించుకొని నివాసం ఏర్పరచుకొని ఆశ్రమంలో చిన్నచిన్న మొక్కలు నాటి దాదాపు 28 ఏళ్లు పెద్దపెద్ద వృక్షాలయ్యే వరకు వాటిని సంరక్షిస్తూ శిష్యుల ప్రోత్సాహంతో ఆశ్రమాన్ని దినదిన ప్రవర్తమానంగా అభివృద్ధి చేస్తూ శిష్యులకు జ్ఞాన బోధ చేస్తూ జ్ఞానానికి అనువైన ప్రదేశంగా ఆశ్రమాన్ని తీర్చిదిద్దారన్నారు. మోన స్వామి మాట్లాడుతూ అందరికీ గురువైన జగద్గురు వేదాంతం లక్ష్మీనాచార్యులు శ్రీ స్వరాజ్య సంఘం అభివృద్ధి ఎంత గొప్పగా చేశారో దాన్ని అంతే ప్రమాణాలతో ప్రొద్దుటూరు, మదనపల్లి, కోటబైలు, బెంగళూరు ,తెనాలి, సోలాపూర్ ప్రాంతాలలో అనేక మంది శిష్యులను బ్రహ్మ విద్యా పాఠకులుగా గురువులుగా శ్రీరామ చైతన్య స్వామి తీర్చిదిద్దారని చాలా గొప్పగా తెలియజేశారు. చివరిగా శ్రీరామ్ చైతన్య స్వామి ఈ ఆశ్రమం నిర్మించడానికి అభివృద్ధి చేయడానికి ఆహార్రాత్రులు కృషిచేసి భక్తులందరి సహాయ సహకారాలు ఇచ్చారని దీనిని భవిష్యత్తులో ఒక ధ్యాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని భక్తులకు విన్నవించారు. బెంగళూరు మదనపల్లి మదనపల్లి ప్రొద్దుటూరు నుండి విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాదం చేశారు.

## మండుటెండలోనూ ఉత్సాహంగా సాగిన బడి పిలుస్తోంది ర్యాలీ

### ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఫలితాలు

**శ్రీకాళహస్తిరూరల్, మే 3 ప్రభాతవార్త**



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురవారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్‌లు అన్నారు. 36 మండలాలు 36 రోజులు బడి పిలుస్తోంది ఇంటింటికీ ప్రచార రథం ఎన్రోల్మెంట్ డ్రైవ్ శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఘనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో అనుభవం అర్హత కలిగిన ఉపాధ్యాయులు బోధన అందించడంతో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్యా బోధనతో పాటు పాఠ్యపుస్తకాలు సమవస్త్రాలు స్కూల్ బ్యాగ్, షూ, సాక్స్, నోట్ పుస్తకాలు, డిక్షనరీ, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం,ఐ ఎఫ్ పి ప్యానెల్స్ ద్వారా డిజిటల్ విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. మానసిక ఒత్తిడి లేకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన అందాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ర్యాలీని పట్టణంలోని నాలుగు మాడవీధులతో పాటు అల్లిమడుగు, చిన్న మిట్టకండ్రిగ, వేడం, అబ్బాబట్లపల్లి, రామలింగాపురం, తొండమనాడు, ఎగువ వీధి, అక్కుర్తి, మంగళపురి, ముచ్చివోలు, వేలవేడు, వాంపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు చంద్రశేఖర్ నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, పుష్ప, మండల విద్యాశాఖ అధికారులు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, సుచరిత, జ్ఞానప్ప, రూపేష్, కృష్ణయ్య, ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, సి ఆర్ ఎం టి లు ముని మోహన్, గాంధీ, కృష్ణయ్య, ప్రదీప్, సునీత, స్వప్న, శాంతి, లలిత, ఐఈఆర్టీలు, విద్యార్థులు, తల్లి దండ్రులు, నాయకులుప్రతాప్ రెడ్డి, బాబురెడ్డి, మురళి, హరి, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అకడమిక్ హైట్స్ విద్యార్థుల విజయ భేరి

**తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త**



స్థానిక ఎమ్ఆర్‌పల్లి సర్కిల్‌లో ఉన్న అకడమిక్ హైట్స్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి విజయ భేరి మోగించారు. ఈ ఏడాది పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించి అత్యుత్తమ ఫలితాలను నమోదు చేసింది. విద్యార్థులు అహర్నిశలు శ్రమించి పరీక్షలు రాసి రాష్ట్ర స్థాయి మార్కులు సాధించడం గమనార్హం. పి. ఈశ్వర్ రెడ్డి 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించి ప్రతిభ చాటాడు. జి. భవిష్యశ్రీ 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించి పాఠశాలకు గౌరవం తెచ్చింది. ఈ విజయంపై పాఠశాల డైరెక్టర్ యమ్. హిమసాగర్ కృష్ణ, ప్రిన్సిపాల్ కె. మురళీకృష్ణ విద్యార్థులను అభినందించారు. అలాగే బోధన, బోధనేతర సిబ్బంది కృషిని కొనియాడుతూ అభినందన సభ నిర్వహించారు. డైరెక్టర్ యమ్.హిమసాగర్ కృష్ణ మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో అహర్నిశలు శ్రమించి 100 శాతం ఉత్తీర్ణత సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రతీ విద్యార్థి తమ లక్ష్యాన్ని చేరుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయి. స్టేట్ స్థాయి మార్కులు సాధించిన మా విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అందుకుంటారని నమ్ముతున్నాను. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు నా హృదయపూర్వక అభినందనలు అని తెలిపారు. విద్యార్థుల విజయానికి తోడ్పడిన తల్లిదండ్రులను కూడా ఈ సందర్భంగా అభినందించారు. ఈ ఫలితాలు భవిష్యత్తులో మరిన్ని విజయాలకు దారితీస్తాయని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

## ఎస్.వి. ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ఫలితాల విడుదల



**తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త**

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని ఎస్.వి. ఆర్ట్స్ కళాశాల (అటానమస్)లో డిగ్రీ రెండవ సంవత్సరం నాల్గవ సెమిస్టర్ ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. పి.వి. చలపతి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఏప్రిల్ 8 నుండి 13 వరకు ప్రాక్టికల్ పరీక్షలు, 16 నుండి 29 వరకు థియరీ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించి, అటానమస్ హోదాలోనే వేగంగా ఫలితాలు విడుదల చేయడం కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. మొత్తం ఫలితాల్లో 93.6 శాతం ఉత్తీర్ణత నమోదవడం విశేషమని, కొన్ని కోర్సుల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని ఆయన అభినం దించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ డా వై మల్లికార్జున రావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. పి.వి. చలపతి, డిప్యూటీ కంట్రోలర్లు డా. కె. కామేశ్వరరావు, కెప్టెన్ వి. రమేష్, ఎగ్జామినేషన్ సెల్ సభ్యులు చక్రవర్తి, నాగరాజు, శేషాద్రి, ప్రభాకర్, పురుషోత్తమ నాయు డు, డి.ఎల్.ఎన్. రాజు తదితరులను అభినందించారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, నిర్వహణ బృందం సమన్వయంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని కళాశాల యాజమాన్యం వెల్లడించింది.

## ఫిజిక్స్‌వాలా విద్యార్థిని ఆకాంక్షకు రాష్ట్ర స్థాయి ప్రతిభ

**తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త**




పదో తరగతి 2026 పరీక్షల్లో ఫిజిక్స్‌వాలా విద్యార్థిని ఆకాంక్ష కూనపరెడ్డి అద్భుత ప్రతిభ కనబరిచి 99.5 శాతం మార్కులు సాధించింది. మొత్తం 600 మార్కులకు 597 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకును దక్కించుకుంది. గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం, రెండవ భాషలో ఆమె వందకు వంద మార్కులు సాధించడం విశేషం. ఈ ఫలితంతో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల జాబితాలో తన స్థానాన్ని ఆకాంక్ష పదిలం చేసుకుంది. తన విజయంపై ఆకాంక్ష మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరాన్ని సిలబస్‌ను చిన్న చిన్న రోజువారీ లక్ష్యాలుగా విభజించుకొని చదవడం ప్రారంభించాను. కేవలం బట్టీ పట్టడం కాకుండా పాఠ్యాంశాల భావాన్ని అర్థం చేసుకోవడంపై దృష్టి పెట్టాను. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు ఫిజిక్స్‌వాలా ద్వారా చదవడం వల్ల నా ఫండమెంటల్స్ మరింత బలపడ్డాయి. ప్రాక్టీస్ ప్రశ్నలు, రివిజన్ సెషన్లు నాకు ఎంతో ఉపయోగపడ్డాయి అని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ సిలబస్‌కు అనుగుణంగా రూపొందించిన ఉడాన్ బ్యాచ్, ఫిజిక్స్‌వాలా తెలుగు ఉచిత మాడ్యూల్స్ ద్వారా ఆకాంక్ష సిద్ధమైంది. గత సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేస్తూ సమయ నిర్వహణ, జవాబుల కచ్చితత్వంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ విజయంపై అలఖ్ పాండే మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన సన్నద్ధత, భావ స్పష్టతతో ఏమి సాధించవచ్చో ఆకాంక్ష ఫలితం చూపిస్తోంది. విద్యార్థులందరి విజయానికి మద్దతు ఇవ్వడం మా లక్ష్యం అని తెలిపారు.

## ఆరోగ్యానికి యోగానే మార్గం.. సమ్మర్ క్యాంప్‌కు ఆహ్వానం

**తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త**

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మే 4వ తేదీ నుంచి యోగా సమ్మర్ క్యాంప్ ప్రారంభం కానుంది. వేసవి సెలవులను ఆరోగ్యవంతంగా, ప్రయోజనకరంగా గడపాలనుకునే వారికి ఇది మంచి అవకాశం అని నిర్వాహకులు తెలిపారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ అనువుగా ఈ శిబిరాన్ని రూపొందించారు. ఈ నెలరోజుల యోగా శిబిరంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాలలో సమగ్ర శిక్షణ అందించనున్నారు. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపు వంటి ప్రయోజనాలను సాధించేందుకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వబడుతుంది. ప్రారంభ స్థాయి నుంచి అభ్యాసం చేయాలనుకునే వారికి ప్రత్యేక మార్గదర్శకత్వం అందిస్తారు. ఈ శిబిరంలో పాల్గొనదలచిన వారు నేరుగా యోగా విభాగాన్ని సంప్రదించి లేదా 8712800169, 9346267582 ఫోన్ నంబర్లకు కాల్ చేసి నమోదు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1500గా నిర్ణయించగా, పరిమిత సీట్లు మాత్రమే ఉండటంతో ముందస్తు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు యోగా విభాగాధిపతి డా. తపన్ కుమార్‌ను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. ఈ యోగా సమ్మర్ క్యాంప్ ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని విశ్వవిద్యాలయ అధికారులు పిలుపునిచ్చారు.

## వేదిక్ విద్యాన్ స్కూల్‌లో ఉద్యోగావకాశాలు



### అర్హులైన అభ్యర్థులకు ఆహ్వానం

**తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త**

నగరంలోని గొల్లవానిగుంట ప్రాంతంలో ఉన్న వేదిక్ విద్యాన్ స్కూల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ చైర్మన్ మహేష్, కరస్పాండెంట్ పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మహేష్, కరస్పాండెంట్ పుష్పలత మాట్లాడుతూ నాణ్యమైన విద్య కోసం నిపుణుల అవసరం అని, పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్లు, రిసెప్షనిస్ట్, కేర్ టేకర్స్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. నాణ్యమైన విద్యను అందించాలంటే అనుభవజ్ఞులైన సిబ్బంది అవసరమని, కనీసం 3 సంవత్సరాల అనుభవం కలిగిన అభ్యర్థులను ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. టీచర్ పోస్టులకు బి.ఈ డి అర్హత తప్పనిసరి కాగా, రిసెప్షనిస్ట్ పోస్టుకు కనీస డిగ్రీ అవసరమని తెలిపారు. అభ్యర్థులు ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం, మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగి ఉండాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.13,000 నుంచి రూ.18,000 వరకు జీతం అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 9652679448, 9908313329 నంబర్లకు సంప్రదించి వివరాలు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్థానిక యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ యాజమాన్యం పిలుపునిచ్చింది.

## రోడ్డుపై మూర్ఛతో పడ్డ యువతి

**కుప్పం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త**

కుప్పం క్రిష్ణగిరి జాతీయ రహదారిలో ఓ యువతి అకస్మాత్తుగా మూర్ఛ వచ్చి రోడ్డుపై పడిపోయింది. అదే మార్గంలో కారులో వస్తున్న ఏరియా ఆసుపత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్ వెంటనే కారు ఆపి యువతిని పరిశీలించారు. మూర్ఛ ఉండడంతో వెంటనే చికిత్స నిమిత్తం ఆమె తన కారులోనే ఆ యువతీని కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు వైస్ చైర్మన్ చూపిన చొరవను అభినందించారు.

### పీఎం కుసుమ పథకం ..ప్రయోజనాలు గురించి

# ప్రజలలో మరింత అవగాహన పెంచాలి



తిరుపతి కలెక్టరేట్ మే 2 ప్రభాతవార్త :
పునరుద్ధరించబడిన పంపిణీ రంగ పథకం ప్రధానమంత్రి సూర్య ఘర్, పీఎం కుసుమ పథకాల ప్రయోజనాలు గురించి ప్రజలలో మరింత అవగాహన పెంచాలనీ జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఉదయం స్థానిక తిరుపతి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యుత్ కమిటీ మెంబర్ సెక్రెటరీ, జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ , విద్యుత్ కమిటీ చైర్మన్, తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దెల గురుమూర్తి అధ్యక్షతన విద్యుత్ శాఖ కు సంబంధించి ఆర్ డి ఎస్ ఎస్, పి ఎం సూర్య ఘర్ పథకం, పీఎం కుసుమ వంటి పథకాల పనుల పురోగతిపై జిల్లా విద్యుత్ కమిటీ సమీక్ష సమావేశం జరిగింది జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఆర్ డి ఎస్ ఎస్ పథకం కింద జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో గృహ మరియు వ్యవసాయ అవసరాల కోసం వేర్వేరు విద్యుత్ లైన్ల ఏర్పాటు లక్ష్యంగా చేపట్టిన పథకం అని అన్నారు. ఈ పథకం ద్వారా గృహాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చి, కుటీర పరిశ్రమలు మరియు చిన్న వ్యాపారాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. మొత్తం ..643 కోట్ల వ్యయంలో, ఇప్పటివరకు ..140 కోట్ల పనులు పూర్తయ్యానీ, లక్ష్యంగా పెట్టుకున్న 450 ఫీడర్లలో, 211 ఫీడర్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. పి ఎం సూర్య ఘర్ పథకం కింద సాధారణ వర్గం సోలార్ యూనిట్లపై సబ్సిడీ అందిస్తోందన్నారు. సాధారణ వర్గం కింద జిల్లాలో 4500 కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఎస్సీ ఎస్టీ ఎస్‌సి వర్గాలకు నెలకు 200 యూనిట్ల లోపు వినియోగం ఉన్న లబ్ధిదారులకు ఉచితంగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే వ్యవసాయ అవసరాల కోసం పీఎం కుసుమ్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తీర మరియు మెట్ట ప్రాంతాలలో విద్యుత్ సౌకర్యం అందుబాటులో లేని ప్రాంతాల్లో సోలార్ ఎనర్జీపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్న ప్రజలను దృష్టిలో ఉంచుకుని అవగాహనా కార్యక్రమాలు చేపట్టి ఈ పథకాలు వారికి చేరువయ్యేలా చేయాలని సూచించారు. గ్రామాలలోని చెరువు కట్టల వద్ద సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అవకాశాలపై ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అదనంగా గ్రామాల్లో విద్యుత్ నష్టాలను తగ్గించేందుకు వీధి దీపాలను ఆటోమేటిక్ వ్యవస్థలతో అమలు చేయాలని, దీని ద్వారా విద్యుత్ ఆదా చేయడంతో పాటు నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. ఈ చర్యలన్నీ సమర్థవంతంగా అమలు అయితే ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరడంతో పాటు విద్యుత్ వినియోగంలో సామర్థం పెరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ ఈ వి. చంద్రశేఖర రావు, కన్స్ట్రక్షన్ పి.ఈ ఈ బాలాజీ , తిరుపతి, అర్బన్ రూరల్, పుత్తూరు, నాయుడుపేట, ఈ ఈ లు, డిప్యూటీ ఈ ఈ లు, కన్స్ట్రక్షన్ డిప్యూటీ ఈ ఈ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పోరాటాలే కార్మికుల లక్ష్యం: పుల్లయ్య

సత్యవేడు, మే 2 ప్రభాతవార్త:



పోరాటాలతోనే వ్యవసాయ కార్మికుల సమస్య పరిష్కారం అవుతాయని రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పుల్లయ్య తెలిపారు. శనివారం సత్యవేడు స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో వ్యవసాయ కార్మిక సంఘ తిరుపతి జిల్లా పదో మహాసభలు వ్యాకాశ ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మహాసభలను వ్యాకాస రాష్ట్ర కమిటీ సభ్యులు గురవమ్మ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఏపీ వ్యాకాస రాష్ట్ర కార్యదర్శి పుల్లయ్య, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య పాల్గొనగా, జిల్లా అధ్యక్షుడు టి.బాలకృష్ణ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యాకాస రాష్ట్ర కార్యదర్శి పుల్లయ్య మాట్లాడుతూ ఆహార ఉత్పత్తిలో వ్యవసాయ కార్మికులు కూలీల పాత్ర కీలకమన్నారు. ఉపాధిహామీ చట్టాన్ని మోదీ ప్రభుత్వం ఎత్తివేయడానికి ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగా రెండు పూటలా పని విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీనిని ఏపీ వ్యవసాయకార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి పని ప్రదేశాల్లో టెంట్లు మంచినీళ్ల, మజ్జిగ పనిముట్లతో పాటు అత్యవసర ఆరోగ్య కిట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల సాగు భూములకు డీ పట్టాలు ఇవ్వాలన్నారు. గిరిజనులకు, దళితులకు ప్రభుత్వ మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, తిరుపతి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, వ్యాకాస జిల్లా ఆఫీస్ బేరర్స్ రాజగోపాల్, రమణయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్, కేవీబీపురం మండల సీఐటీయూ కార్యదర్శి నాగరాజు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణాచలం, సత్యవేడు మండల కార్యదర్శి కృష్ణయ్య, నాగలాపురం మండల కార్యదర్శి మురుగేష్, గ్రీన్ అంబాసిడర్ కార్మిక సంఘ కార్యదర్శి మునస్వామి, డప్పు కళాకారుల సంఘ అధ్యక్షులు అరుణ్, పలు ప్రజా సంఘ నాయకులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

తిరుపతి క్రీడ, మే 2, ప్రభాతవార్త
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడ ఆదేశాల మేరకు జిల్లా ప్రాధికార సంస్థ తిరుపతి వారి ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో క్రీడా శిక్షణ కేంద్రాలు మే నెల ఒకటో తేదీ నుండి 31వ తేదీ వరకు జరుగు సమ్మర్ కోచింగ్ క్యాంప్ వేసవి శిక్షణ క్రీడా శిబిరాలు 2026 కేటాయించిన్నట్లు తిరుపతి క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎన్. శశిధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వేసవి శిక్షణా శిబిరాన్ని సంకల్పంతో కేటాయించబడిందన్నారు. పట్టణ ప్రాంతాలు ముఖ్యంగా మారుమూల గ్రామాలకు మండలాలకు క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు నిష్టాతులైన శిక్షకులచే వారి వ్యక్తిగత క్రీడలలో మేలుకువలు నేర్పించడం ముఖ్య ఉద్దేశం క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు, క్రీడా పరికరాలను ప్రభుత్వం నిధులు మంజూరు చేయడమైందని తెలిపారు. శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు చొరవతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు 61 శిక్షణ కేంద్రాలు కేటాయించబడిందన్నారు. మొత్తం మండలాలు 18 కొత్త క్రీడాంశాలు 29, ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, శాప్ డైరెక్టర్ ఈ రజని, తిరుపతి జిల్లా శిక్షకులు శ్రీ లక్ష్మి కరుణ, వి.జి. ప్రేమ్‌నాథ్, గోపి, చక్రవర్తి, నాగరాజ్, వినోద్, హిందూజా, సాయి సుమతి, యహజ్, డీఎస్సీ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

# అధికారులు అండగా....
# అవినీతి అక్రమాలు దండిగా....

### ఇరిగేషన్ పనులలో భారీగా ప్రజాధనం గోల్మాల్...



ఓబులవారిపల్లి, మే 3 ప్రభాత వార్త
ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న అంతా మనవాళ్లే. అన్న పదాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్న అధికార యంత్రాంగం. వారికి వత్తాసు పలుకుతూ అండగా ఉంటున్న రాజకీయవేత్తలు. అటు రాజకీయ బలం ఇటు ధనవనం రెండు. ఒకటైతే వారికి ఎదురేమి ఉండదని ధనార్జనే ధ్యేయంగా కొంతమంది అభివృద్ధి పనులలో చేతివాటం ప్రదర్శిస్తూ చేయని పనులకు చేసినట్లు చూపి లక్షలాది రూపాయలు ప్రజాధనాన్ని స్వాహా చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులు విచారణ పేరుతో జాప్యం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం మంగంపేట పంచాయతీలో అటు పాలకవర్గం. ఇటు ప్రతిపక్షం అనే తేడా లేకుండా అందరూ అందరి వాళ్లమే అంటూ లోపాయకారి ఒప్పందాలు కుదుర్చుకుని నిధులను పంచుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే కొన్నిచోట్ల ఇరిగేషన్ అధికారులు ఇష్టానుసారంగా బిల్లులు పెట్టి లక్షల రూపాయలు నిధులను ప్రజాధనాన్ని దోచేస్తున్నారని విమర్శలుస్తున్నాయి. మంగంపేటలో ఎక్కడ చూసినా ఇదే పంపు అవినీతి పనులపై అక్రమార్కుల అండ ఉందని ఆరోపణలు లేకపోలేదు. కొన్ని చోట్ల పనులు వేళ్లపైన లెక్కేస్తున్నప్పటికీ బిల్లు అయిపోయింది. మాకేంటి పని అని అవినీతిపరులు ఎంచక్కా నిజాయితీపరులు అంటూ దొంగకు తేలు కుట్టినట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఈ పనుల అవినీతి కూపం నుంచి ఎలా బయటపడాలి దేవుడా అంటూ గడుపుతున్నారంటే చెప్పకనే తెలుస్తోంది. ఏది ఏమైనా విచారణ అధికారులు పనుల రికార్డులను సీజ్ చేశారు. ఆ తర్వాత అధినాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి విచారణ సాగిస్తున్నారా లేక నిజాలు నిర్భయంగా తెలుస్తారా అన్నది తేలాల్చి ఉంది.

## రేపు ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా

**చిత్తూరు హెల్త్, మే 2 ప్రభాతవార్త:**
చిత్తూరు ప్రభుత్వ ఐటిఐలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ రవీంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుండి ప్రారంభమయ్యే జాబ్ మేళాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐల్లో శిక్షణ పూర్తి చేసి పాసైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఈ జాబ్ మేళాలో అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ ఏఆర్‌జిసి బంగారుపాళ్యంలో వున్న ఖాళీలను భర్తీ చేస్తారన్నారు.

## శెట్టిపల్లి భూముల సమస్యకు చరిత్రాత్మక పరిష్కారం

### - తుడ చైర్మెన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, మే 2 ప్రభాతవార్త:



దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న శెట్టిపల్లి భూముల సమస్యకు పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తూ తుడా చైర్మెన్ డాలర్స్ దివాకర్ రెడ్డి శనివారం తిరుపతిరూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్వయంగా పరిశీలించారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులతో మాట్లాడిన ఆయన, డాక్యుమెంట్ల పరిశీలన, స్లాట్ బుకింగ్ నమోదు ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా రిజిస్ట్రేషన్స్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

**ఉచిత రిజిస్ట్రేషన్లు...ప్రభుత్వ భారం రూ.16కోట్లు**

శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కారంలో భాగంగా సుమారు రూ.16కోట్లు రుపాయాల రిజిస్ట్రేషన్ ఫీజును ప్రభుత్వం భరిస్తోందని దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. లబ్దిదారులపై ఒక్కరుపాయి భారం పడకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు సుమారు 1300 మంది రైతులు తమ భూముల రిజిస్ట్రేషన్స్ పూర్తి చేసుకున్నారని, మిగిలిన 700మంది త్వరగా అధికారులను సంప్రదించి నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో శెట్టిపల్లి రైతుల ఏళ్లనాటి కల నెరవేరిందని దివాకర్‌రెడ్డి అన్నారు. ఈ ప్రక్రియ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వారం లేదా పది రోజులలో ఇన్‌చార్జి మంత్రి మున్సిపల్ శాఖ మంత్రి సమక్షంలో లబ్దిదారులకు ఒరిజినల్ డాక్యుమెంట్లు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తుడ కార్యధర్శి శ్రీకాంత్‌బాబు, భూ సేకరణ అధికారి సుజన, సబ్ రిజిస్ట్రార్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శనీశ్వరునికి అభిషేకాలు



శ్రీకాళహస్తి,మే 2 ప్రభాతవార్త:
శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరునికి శనివారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలునిర్వహించారు. కాగా పక్కనే వెలసిన అభయ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేకాలంకారాలు నిర్వహించారు. వేసవి సెలవులతో శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల తాకిడి పెరిగింది. శనివారం కావటంతో శనీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకొనుటకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

## ఎస్వీ వైద్య కళాశాల, గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్

### రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ సుబ్బారావు ఏకగ్రీవ ఎన్నిక



తిరుపతి హెల్త్, మే 2 ప్రభాతవార్త
గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఏపీ(జీడిఏఏపి) ఎస్వి వైద్య కళాశాల తిరుపతి యూనిట్ అధ్యక్షులుగా ప్రముఖ పలమనాలజిస్టు, రుయా ఆసుపత్రి పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బా రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సాయంత్రం ఎస్వీ వైద్య కళాశాలలోని సామాజిక వైద్య విభాగం, (డిపార్ట్మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్) లెక్చరర్ గ్యాలరీలో నిర్వహించిన ఈ ఎ న్నికలకు కేంద్ర పరిశీలకుడుగా విజయవాడ ఎస్.ఎం.సి. ఆసుపత్రి న్యూరో సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ బాబి శ్యామ్ కుమార్ రిటర్నింగ్ అధికారిగా తిరుపతి ఎస్వీవైద్య కళాశాల జనరల్ సర్జన్ విభాగాధిపతి డాక్టర్ డబ్ల్యు సుధాకర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు ఎస్వీఎంసీ జీడిఏఏపి అధ్యక్షులుగా డాక్టర్ సుబ్బారావు, కార్యదర్శిగా డాక్టర్ మల్లికార్జున్, పెథాలజీ విభాగం, కోశాధికారిగా డాక్టర్ ఎం.ఏ హరి బాబు, జనరల్ సర్జరీ విభాగం ఉపాధ్యక్షులుగా డాక్టర్ సాధన, ఆప్తమాలజీ విభాగం, డాక్టర్ జోస్నాదేవి, డాక్టర్ హరికృష్ణ సంయుక్త కార్యదర్శి డాక్టర్ బెనర్జీ, డాక్టర్ పరమేశ్వరి బాబు, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. అదే విధంగా జనరల్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్ సునీల్ కు మార్, డాక్టర్ మధుసూదన్ రావు ఎన్నిక కాగా కార్యనిర్వాహక సభ్యులుగా డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ మురళీధర్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ భరత్, డాక్టర్ చిరిమల, డాక్టర్ జయ సూర్య, డాక్టర్ రమేష్ కుమార్ ఎన్నిక య్యారు. అనంతరం నూతన కార్యవర్గం నియామక పత్రాలను ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభుకు డాక్టర్ సుబ్బారావు తదితరులు అసోసియేషన్ నియామక పత్రాన్ని అందజేసారు. రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మనోహర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ డాక్టర్స్ అసోసియేషన్ ఏపీ తిరుపతి యూనిట్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా వైద్యుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తానని తెలిపారు. అంతేకాక డాక్టర్స్ అసోసియేషన్ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని డాక్టర్ సుబ్బారావు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వి వైద్య కళాశాల వైద్యు అధ్యాపకులు, వైద్య సిబ్బంది తదుతరులు పాల్గొన్నారు.

## 4న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పుత్తూరు రూరల్, మే 2 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం పుత్తూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రతిశాఖకు సంబంధించిన మండల స్థాయి అధికారులు హాజరై, తమ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు. సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే అవసరమైన సూచనలు జారీ చేసి ఫిర్యాదుల త్వరిత పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. పుత్తూరు మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మీ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి మీ సమస్య పరిష్కరించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



**తుడా సిమెంటు రోడ్డు**

# శ్రీకాళహస్తి రోడ్లకు తుడా సింగారాలు

## ఎంఎల్ఏ కృషి ఫలించింది

శ్రీకాళహస్తి,మే 2 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో తుడా నిధులతో రోడ్లకు సింగారాలు అద్దుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత శ్రీకాళహస్తి మున్సిపాలిటి ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసిన శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అభివృద్ధికి మున్సిపల్ శాఖ నుంచి అలాగే తుడా నుంచి నిధులు సాధనకు పట్టుబట్టారు. పలుమార్లు తుడా చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డిని శ్రీకాళహస్తి రప్పించి ఇక్కడి మున్సిపల్ పరిస్థితిని వివరించారు. రోడ్లు దుస్తితిని వివరించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి నుంచి భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన నిధులను తుడాకు చెల్లిస్తున్నారని ఇక్కడ అభివృద్ధికి నిధులు కేటాయించాలని అభ్యర్థించారు.దాంతో తుడా చైర్మెన్ కొన్ని రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసారు.ఈ నేపధ్యంలో రోడ్లతోపాటు కాలువలను నిర్మిస్తున్నారు. శ్రీకాళహస్తిలో తుడా నిధులతో చేపట్టిన రోడ్లు కాలువలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.ఎస్‌డికె నగర్‌లో రూ.46లక్షలతో సిమెంటు రోడ్డును, కుమారస్వామి తిప్ప వద్ద రూ.40లక్షలతో రోడ్డును, మార్కెట్ నుంచి నాయుడుపేట రోడ్డు వరకు రూ.43లక్షలతో రోడ్డును,అగ్రహారం రూ.32లక్షలు, సంపతీశ్వరాలయం వద్ద రూ.8.5లక్షలతో రోడ్డు కాలువ, హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.37.5లక్షలతో శాంతి నగర్‌లో రూ.12.5లక్షలతో నిర్మించుటకు నిధులు మంజూరు చేసారు.ఈ నిధులతో రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. దాంతో ఎంతో కాలంగా అబివృద్ధికి నోచుకొని రోడ్లకు మోక్షం లభించింది.

# తిరుపతి డివిజన్

## ఇంటింటి సర్వేలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



తిరుపతిరూరల్, మే 2 ప్రభాతవార్త:
సెన్సస్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో భాగంగా ఫీల్డ్ స్థాయిలో జరుగుతున్న పనితీరును పరిశీలించుటకు శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు అవిలాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. సర్వే సిబ్బంది నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి, ఖచ్చితత్వం, సమయపాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అవిలాల పంచాయతీ పరిధిలోని శ్రీనివాసనగర్ స్థానికులతో కలెక్టర్ మాట్లాడి, సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. వివరాలను సరిగ్గా అందించడం ద్వారా భవిష్యత్‌లో సంక్షేమ పథకాలకు ఇది కీలకమని తెలిపారు. సర్వేలో భాగంగా ప్రతి కుటుంబ వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా డేటా సేకరణ జరగాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సర్వే సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

## తిరుపతిలో ఐసెట్ పరీక్షలు సాఫీగా నిర్వహణ

తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త



ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఐసెట్-2026 పరీక్షలు జిల్లాలో సాఫీగా జరిగాయి. ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షకు తిరుపతి జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 1598 మంది అభ్యర్థులకు 1518 మంది పరీక్షకు హాజరై సుమారు 95 శాతం హాజరు నమోదైంది. జూపార్క్ సమీపంలోని అయాన్ డిజిటల్ సెంటర్, కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల, రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల, పుత్తూరు సమీపంలోని శ్రీ వెంకటేశ పెరుమాల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.మొత్తంగా అధిక హాజరు, సమర్థవంతమైన నిర్వహణతో ఐసెట్ పరీక్షలు విజయవంతంగా ముగిశాయి.

## తిరుపతిరూరల్ తహశీల్దార్ కార్యాలయంలో 4న పిజిఆర్ఎస్

తిరుపతిరూరల్, మే 2 ప్రభాతవార్త:
తిరుపతిరూరల్ మండల తహశీల్ధార్ కార్యాలయంలో మే4న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్స్) నిర్వహించనున్నట్లు తహశీల్ధార్ జనార్ధన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులందరూ ఒకేచోట అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కరించనున్నారు. ఫిర్యాదు చేసినవారికి అధికారిక రశీదు ఇవ్వబడుదుందని, నిర్ణీత గడువులో పరిష్కారం లేకపోతే సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. జిల్లాస్థాయి సమస్యలకు కలెక్టరేట్‌ను ఆశ్రయించాలని సూచించారు. అదేవిధంగా తిరుపతి అర్బన్ తహశీల్ధార్ కార్యాలయంలో ఈనెల 4న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) నిర్వహించనున్నట్లు తహశీల్ధార్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

## గిరిజన బాలికలకు నగదును అందించిన మానవతా సంస్థ...

రైల్వే కోడూరు రూరల్ మే 2( ప్రభాతవార్త)::



రైల్వే కోడూరు మండలంలోని విపిఆర్ కండ్రిక లక్ష్మీపురం ఎస్టీ కాలనీలో పాలెం కోట కళావతి భర్త నవీన్ ప్రమాదవశాత్తు మంణించిన సందర్భంలో మృతుడికి భార్య ముగ్గురు ఆడ బిడ్డలు కటిక దరిద్రాన్ని అనుభవిస్తున్న సందర్భంలో సమాచారం తెలుసుకున్న మానవత సంస్థచైర్మెన్ జె.ప్రసాద్ వర్మ5000 వేల రూపాయలు చెక్కును బాధితులకు అందజేసినట్లు వారు తెలిపారు. రైల్వే కోడూరు మండలంలో మానవతా సంస్థ ఇబ్బందుల్లో ఉన్న వారికి ఏదో ఒక రూపంలో సహాయం చేయడం ఎంతో సంతోషం అని గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా పేదలకు సేవ చేయడంలో పరమాత్మ స్వరూపం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రెసిడెంట్ ఎం చంద్రమోహన్ రాజు, డైరెక్టర్ నాగరాజా, సభ్యులు వెంకట సుబ్బరాజు, సుభాష్, మునికృష్ణ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయంలో కొనసాగుతున్న వేసవి రద్దీ

కాణిపాకం, మే 2 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శనివారం సైతం వేసవి రద్దీ కొనసాగడంతో ఆలయంలో క్యూలైన్లు అన్ని కిటకిటలాడాయి. గత కొద్ది రోజులుగా పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో ఆలయంలో భక్తుల రద్దీ పెరుగుతోంది. దీనికి తోడు శని, ఆదివారాలు వారంతపు రోజులు కావడంతో సాధారణంగా భక్తుల రద్దీ వుంటుంది. ఈ మేరకు ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి అనూహ్యంగా తరలివచ్చిన భక్తులతో కాణిపాకం ఆలయం పోటెత్తింది. ఉదయం నుండి రాత్రి వరకు ఆలయంలో రద్దీ కొనసాగింది. వంద రూపాయల శీఘ్ర దర్శనం, రూ.150 అతి శీఘ్ర దర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం స్వామి వారి దర్శనం కోసం మూడు, నాలుగు గంటలకు పైగా క్యూ లైన్లలో వేచి వుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రద్దీ దృష్ట్యా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

## జంట ఏనుగులు పంటలపై దాడి

రామకుప్పం, మే 2 ప్రభాతవార్త
మండలంలోని రామాపురం తండాలో రైతులు పండిస్తున్న పంటలపై దాడి చేశాయి. శుక్రవారం రాత్రి గ్రామ సమీపంలో ఉన్న గోపాల్, కుమార్ నాయక్ ,గోపాల్ నాయక్ లకు చెందిన వరి, బీన్స్ పంటలను తిన్నంత తిని తొక్కేశాయి. నిత్యం ఏనుగు దాడులతో అటవీ గ్రామ రైతులు భయాందోళన చెందుతున్నారు. పగలంతా అటవీ ప్రాంతంలో రాత్రి సమయానికి పంటలపై చొరబడి రైతులకు అపార నష్టం తొలగిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల కట్టడి చేసేందుకు ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని స్థానిక రైతుల కోరుతున్నారు. తమకు నష్టమైన పంట నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలన్నారు.

## మహిళల భద్రత మా బాధ్యత

రామకుప్పం ,మే 2 ప్రభాతవార్త



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళల భద్రత మా బాధ్యత కార్యక్రమాన్ని బగళ నత్తం గ్రామంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా గ్రామంలో శాంతిభద్రతలకు సహకరించాలని, మహిళలపై వేధింపులకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు అవ్వద్దని ఎస్ఐ వెంకట మోహన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.